తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక
జూన్ 2017 వెల రూ.5/-





వజ్రకవచ సమర్పణ    ముత్తంగి కవచ సమర్పణ    సువర్ణ కవచ సమర్పణ

## తిరుమల
## శ్రీవారిజ్యేష్ఠాభిషేకమహోత్సవం :: 07-06-2017 - 09-06-2017





తిరుమల తిరుపతి దేవస్థానముల
నూతన కార్యనిర్వహణాధికారిగా
శ్రీవారి సన్నిధిలో 06-05-2017 శనివారం
పదవీబాధ్యతలు స్వీకరించిన
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,

నూతన కార్యనిర్వహణాధికారికి శ్రీవారి ప్రసాదాలను అందజేస్తున్న
తి.తి.దే. ఉభయ సంయుక్త కార్యనిర్వహణాధికారులు (తిరుమల, తిరుపతి)




నూతన కార్యనిర్వహణాధికారికి మంగళాశాసనాలు అందిస్తున్న
శ్రీశ్రీ పెరియకోయిల్ కేళ్వి అప్పన్ శ్రీ శఠగోపరామానుజ జియ్యర్ స్వామి
(తిరుమల పెద్దజియ్యర్‌స్వామి)
శ్రీశ్రీ ఇళయకోయిల్ కేళ్వి అప్పన్ శ్రీ గోవిందరామానుజ జియ్యర్ స్వామి
(తిరుమల చిన్నజియ్యర్‌స్వామి)



తిరుమల, రంగనాయకమండపంలో తి.తి.దే. వేదపండితుల
ఆశీర్వాదాలందుకుంటున్న నూతన కార్యనిర్వహణాధికారి

# భగవద్గీత


**శ్లోకం :** యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ (గీత.6-17)



**ప్రతిపదార్థం :** యుక్త ఆహార విహారస్య= పరిమితమైన ఆహార విహారాలు గలవాడూ; కర్మసు=జపతపాది కర్మలలో; యుక్త చేష్టస్య= నియమిత ప్రయత్నం ఒనర్చువాడూ; యుక్త స్వప్న అవ బోధస్య= పరిమితమైన నిద్రాజాగరణాలు కలవాడు అయిన పురుషునికి; దుఃఖహా=సంసార దుఃఖ నాశకమైన; యోగః=ధ్యానం; భవతి= అవుతుంది.

**భావం :** పరిమితమైన ఆహార విహారాలు కలిగి జపతపాది కర్మలందు పరిమితమైన ప్రయత్నం కలిగి, నియమితమైన (నిర్దిష్టమైన కాల పరిణామములు కలిగిన) నిద్రాజాగరణాలు కలిగి ఉండేవానికి, సంసార దుఃఖాన్ని పోగొట్టే వానికి ధ్యానం కుదురుతుంది.

# శ్రీదేవిరమణుఁడు శ్రీవేంకటేశ..



మా దురితములు వాపి మమ్ముఁ గాచుటరుదా
శ్రీదేవిరమణుఁడు శ్రీవేంకటేశ

అంబరీషుఁ బైకొన్న ఆపదలన్నియుఁ బాపి
బెంబడిఁ గాచే నీచే పెనుచక్రము
అంబరాననున్న ధ్రువ నజ్ఞానమెల్లఁ బాపె
పంచి నీ చేతనుండిన పాంచజన్యము

పక్కన జరాసంధు బలమెల్ల నుగ్గాడి
నిక్కము మధురనిల్పె నీచే గదా
తొక్కి హిరణ్యకశిపుఁ దునిమి ప్రహ్లాదుఁ గాచె
నిక్కి నిక్కి మెరిచేటి నీ ఖడ్గము

విడరావణునిఁ జంపి విభీషణునిఁ గాచె
చిడుముడి పడక నీచే శార్ఙ్గము
యెడమీక శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గాచె
బడిబడి నీ నామ పఠన నేఁదిదిగో

(సంపుటం - 03, సంకీర్తన - 434)



అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని పంచాయుధాలు భక్తులను రక్షించిన తీరును వర్ణిస్తున్నాడు - అంబరీషుని ఆపదలనుండి రక్షించిన సుదర్శన చక్రమూ, ధ్రువుని అజ్ఞానాన్ని పోగొట్టిన పాంచజన్యమూ (శంఖం), జరాసంధుని బలమణచిన కౌమోదకీ (గద), హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని కాచిన నందకమూ (ఖడ్గం) రావణుని చంపిన శార్ఙ్గమూ (ధనుస్సు) రక్షించినట్లుగా కలియుగంలో 'శ్రీవేంకటేశు' నామమే మనందరిని సదా కాపాడుతుందని ప్రబోధిస్తున్నాడు.

## మీ మాట

### బాగుంటున్న ధారావాహికలు

సప్తగిరిలో ప్రతినెలా వెలువడుతున్న 'పరమయోగి విలాసం', 'కైంకర్యమే తనువుదాల్చితే...!' ధారా వాహికలు మాకు ఎన్నో విశేషాలను తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా 'పరమయోగివిలాసం'లో ఆళ్వారుల దివ్యచరిత్రలు ఏ నెలకు ఆ నెల ఆసక్తి గొలుపుతున్నాయి.

'కైంకర్యమే తనువుదాల్చితే...!'లో భగవద్రామానుజుల జీవితచరిత్ర ప్రణాళికాబద్ధంగా ఆయా ఘట్టాల గురించి చాలా చక్కగా వస్తోంది. *– జి.స్వాతి, విశాఖపట్నం.*

### దీవెనలు!

ఇటీవల సప్తగిరి మాసపత్రికలో అందిస్తున్న అన్ని వ్యాసాలు నవనీతమంత కమ్మగా ఉంటున్నాయి. ఈ పత్రికలోని విషయాలు చదువుతుంటే ఆ దేవదేవుడే మాకు దీవెనలు అందించినట్లు ఉంటుంది. సంపాదకీయాలు చాలా ఆలోచనాత్మకంగా ఉంటున్నాయి.

*– ఎం.అప్పారావు, అనకాపల్లి.*

### అందంగా...

ఈ మధ్యకాలంలో సప్తగిరి మాసపత్రిక చాలా అందంగా ముద్రితమౌతుంది. ఫోటోలు, చిత్రాలు చాలా బాగుంటున్నాయి. ముఖ్యంగా రంగుల పేజీలు మరింత ఆకర్షణీయంగా ఉన్నాయి. పత్రిక వెలను పెంచినా కొనటానికి పాఠకులు ఏ మాత్రం వెనకాడరనటం నిస్సందేహం.

*– జి.గోపి, ఏలూరు.*

### నేర్పుతుంది

సప్తగిరి మాసపత్రిక రాను రాను ఎంతో అభివృద్ధి చెందుతోంది. మా అందరికి ఆధ్యాత్మికంగా ఎన్నో కొత్త విషయాలను నేర్పుతుంది. *– పి.మురళి, కాణిపాకం.*

### విడువకుండా...

సప్తగిరిలో పత్రిక మా ఇంటిల్లిపాదీ విడువకుండా చదువుతాము. పత్రిక చదవడంవల్ల మాకు ప్రతి నెల తిరుమలలో విహరించినంత అనుభూతి కలుగుతుంది.

*– టి.సునీత, ఖమ్మం.*

### భక్తిభావాన్ని పెంచుతున్నాయి!

పాఠకులను సత్య, ధర్మమార్గాలతో పాటు భక్తిభావం వైపుకూడా నడిపించే విధంగా మీరు ప్రచురిస్తున్న వ్యాసాలు, శీర్షికలు ఉపయుక్తంగా ఉన్నాయి. వివిధ అలంకారాలతో స్వామివారి దేవేరుల చిత్రాలు నేత్రపర్వం గావిస్తున్నాయి. ఇందులో సంపాదకుల కృషి శ్లాఘనీయం.

స్వల్పమూల్యంతో అపార ఆధ్యాత్మిక విషయాలను నెలనెలా తెలుసుకొనే వీలు కల్పిస్తున్నారు. 'సప్తగిరి' సిబ్బందికి అభినందనలు. *– డి.జ్యోతి, హైదరాబాదు.*

### పత్రికకే ఒక హైలైట్

పత్రిక చదువుతుంటే మనస్సు నిర్మలంగా, ప్రశాంతంగా, తేలిపోతూ అలౌకికమైన ఆనందాన్ని పొందుతున్నాం. ఈ విధంగా పత్రికను తీర్చిదిద్దుతున్నందుకు ధన్యవాదాలు. పత్రికలోని ప్రతిపేజి చివరన ఉన్న ఆణిముత్యాల్లాంటి సూక్తులు పత్రికకే ఒక హైలైట్. వాటియొక్క భావం ప్రతి పాఠకుని హృదయాన్ని హత్తుకునే విధంగా ఉన్నాయి. ఆచరణలో సమాజానికి మంచి చేయడానికి ప్రోత్సహించేలా ఉన్నాయి. మరిన్ని సూక్తులు, మంచి ఆధ్యాత్మిక విషయాలతో మన సప్తగిరి పత్రిక భక్తిపరులైన పాఠకులను అలరించాలని కోరుకుంటున్నాం.

*– కె.రంగనాథ్, కరీంనగర్.*

### ముఖాముఖీ...

'సప్తగిరి' మాసపత్రికను చదివితే మాకు దేవునితో ముఖాముఖి మాట్లాడినట్లు అన్పిస్తోంది. మీకు ధన్యవాదాలు.

*– బి.గోవిందు, చెంబకూరు.*

## 2017 జూలై నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 03-13 | తాళ్లపాక శ్రీకామాక్షిదేవి సమేత శ్రీసిద్ధేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు |
| 04-06 | శ్రీగోవిందరాజస్వామివారి జ్యేష్ఠాభిషేక మహోత్సవము, తిరుపతి |
| 04-07 | శ్రీకపిలేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు, తిరుపతి |
| 09 | వ్యాసపూర్ణిమ, గురుపూర్ణిమ |
| 16 | తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థానము |
| 18-21 | శ్రీకోదండరామస్వామివారి పవిత్రోత్సవాలు, తిరుపతి |
| 28-30 | శ్రీపట్టాభిరామస్వామివారి పట్టాభిషేక మహోత్సవము, వాయల్పాడు |
| 23 | శ్రీచక్రత్తాళ్వార్ వర్ష తిరు నక్షత్రం |
| 25 | మంగళగౌరీవ్రతము |
| 28 | గరుడపంచమి |

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 48 జూన్, 2017 సంచిక : 01



వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥




సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
0877-2264543
విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


## ఈ నెలలో....



ముఖచిత్రం : శ్రీవారి జ్యేష్ఠాభిషేకం (తిరుమల)
వెనుక చిత్రం : శ్రీగోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తి (తిరుపతి)





24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333




వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com

సంపాదకీయం

# గౌరవ సంపాదకులకు సౌహార్దస్వాగతం



శ్రీ వేంకటేశ్వరస్వామివారిభక్తులు **శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్,** ఐ.ఏ.ఎస్., తి.తి.దే. 25వ కార్యనిర్వహణాధికారిగా 2017, మే 06వ తేదీన పదవీబాధ్యతలు స్వీకరించారు. వీరు అపారఅనుభవజ్ఞులుగా, సునిశితపరిపాలకులుగా, క్రమశిక్షణకు మారుపేరుగల అధికారిగా పేరుపొందారు. వీరు 1993 ఐ.ఏ.ఎస్., బ్యాచ్‌కి చెందినవారు. వీరు 24-08-1995 నుంచి 02-05-1997 వరకు గద్వాల సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. 09-05-1997 నుంచి 11-11-1999 వరకు పశ్చిమగోదావరిజిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారిగా పనిచేశారు. 15-11-1999 నుంచి 19-12-2002 వరకు గుంటూరుజిల్లా సంయుక్త కలెక్టరుగా పనిచేశారు. 29-12-2002 నుంచి 22-06-2003 వరకు చిత్తూరుజిల్లా సంయుక్త కలెక్టరుగా పనిచేశారు. 24-06-2003 నుంచి 16-05-2005 వరకు మెదక్ జిల్లా కలెక్టరుగా పనిచేశారు. 18-05-2005 నుంచి 28-01-2006 వరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టరుగా పనిచేశారు. 28-01-2006 నుంచి 14-01-2008 వరకు విశాఖపట్నం కలెక్టరుగా నియమితులైనారు. ఆ తర్వాత 2008 నుంచి కేంద్ర సర్వీసుల్లో పనిచేస్తున్నారు. 2009 నుండి 2012 వరకు రక్షణశాఖలో ప్రైవేటు కార్యదర్శిగా విధులు నిర్వహించారు. 2012 నుంచి 2014 వరకు మానవవనరుల అభివృద్ధి శాఖలో ప్రైవేటు కార్యదర్శిగా పనిచేశారు. తి.తి.దే. కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టక ముందు వరకు ఢిల్లీలోని ఏ.పి.భవన్ రెసిడెంట్ కమీషనరుగా బాధ్యతలు నిర్వర్తించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన తాను రానున్న రోజుల్లో సామాన్య భక్తులే ధ్యేయంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. సనాతనహైందవధర్మప్రచారానికి శ్రీవారిభక్తులు రాయబారులుగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. తి.తి.దే. ఉద్యోగులలో నిగూఢమైనశక్తి దాగి ఉందనీ, దాన్ని వెలికితీసి, నైపుణ్యవంతమైన పనితీరుతో భక్తులసేవలో తరించేలా చేస్తాననీ వివరించారు.

కార్యనిర్వహణాధికారిగానే కాక వీరు సప్తగిరి మాసపత్రికగౌరవసంపాదకులుగానూ వ్యవహరిస్తారు. భక్తులందరితో పాటు **'సప్తగిరి'** కార్యాలయ నిర్వాహక సిబ్బందికూడా శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్., గారికి హార్దమయిన స్వాగతసుమాంజలి అందజేస్తోంది. వీరి సారథ్యంలో **'సప్తగిరి'** మరింత వృద్ధి చెందాలనీ, శ్రీవారిభక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయనీ ఆశిద్దాం.



# సాదర వీడ్కోలు!

తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారిగా గతంలో బాధ్యతలు నిర్వహించిన **డా॥ దొండపాటి సాంబశివరావు,** ఐ.ఏ.ఎస్., వాణిజ్యపన్నులు, ఎక్సైజ్ స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్స్ శాఖల సి.సి.ఎస్.గా ఉన్నత పదవిలో సచివాలయానికి బదిలీ అయ్యారు. వీరు తిరుమలలో సాధారణభక్తులసౌకర్యాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. తి.తి.దే. పరిపాలనలో సంస్కరణలకు పెద్దపీట వేశారు. పరిపాలనలో అనేక మార్పులు చేశారు. **వీరు ముఖ్యంగా 2016 జనవరి నుంచి 'సప్తగిరి' మాసపత్రికలు (ఆరు భాషలు) పూర్తిగా వర్ణపుటలలోకి తీసుకురావడం, పాఠకులు ఆన్‌లైన్ ద్వారా తమ చందాను నమోదు చేసుకోవడం, సరైన సమయంలో బట్వాడా చేయడానికి విశేష కృషి చేశారు.** వీరికి, వీరి కుటుంబ సభ్యులకు శ్రీవారిఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని **'సప్తగిరి'** ప్రార్థిస్తోంది.



పచ్చతోరణం

# శ్రీవారి జ్యేష్ఠాభిషేకం

- శ్రీ అర్చకం రామకృష్ణదీక్షితులు

**శ్రీవేంకటాచలాధీశం శ్రియాధ్యాసిత వక్షసం।**
**శ్రితచేతన మందారం శ్రీనివాస మహం భజే ॥**

శ్రీనివాసప్రభువు సమస్త చరాచర సృష్టికి జగత్ప్రభువు, సర్వాధారుడు, సనాతనుడు, ఆశ్రిత భక్తజన వత్సలుడు, లక్ష్మీదేవిని వక్షఃస్థలమందు ధరించినవాడు. పాపపంకిలమైన ఈ కలియుగంలో, భక్తజనులందరికీ మార్గనిర్దేశం చేస్తూ, పూజలందుకుంటున్నాడు. అందుకే నిత్యం శ్రీవారిఆలయంలో పఠింపబడే దివ్యమైన శ్రీవేంకటేశసుప్రభాతం– "సంసారసాగర సముత్తరణైక సేతో"– అన్నట్లుగా 'శ్రీవేంకటేశ! నీవు లక్ష్మీదేవికి నివాసమైన వాడవు. సద్గుణ సముద్రుడవు. సంసారసాగరాన్ని తరించుటకు అనువైన వారధివి. వేదాంత వేద్యుడవు. భక్తులకు స్వాధీనుడవు! అని హృద్యంగా కీర్తిస్తుంది. నిజమే! దేవదేవుడైన కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసుప్రభువు భక్తులకు స్వాధీనుడు. అందుకు వరాహావతారంలో చరమశ్లోకంలో స్వామి భక్తులను అనుగ్రహిస్తూ–

**తతస్తం మ్రియమాణం తు కాష్ఠ పాషాణ సన్నిభమ్।**
**అహం స్మరామి మద్భక్తం నయామి పరమాం గతిమ్॥**

అని వాగ్దానం చేస్తాడు. ఎవరైతే తమ ప్రాణాలను వదిలే సమయంలో నన్ను స్మరిస్తారో వారు నన్నే చేరుకుంటారని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ పేర్కొన్నాడు.

అదే విధంగా శ్వేతవరాహకల్పంలో శ్రీఆదివరాహ స్వామి వారిగా అవతరించిన శ్రీమన్నారాయణుడు కల్పాంతం వరకు సమస్త ప్రాణికోటిని తరింపజేయటానికి శ్రీవేంకటాచల పర్వతంపై అర్చావతార రూపంలో కొలువై ఉండి, ఇలా అనుగ్రహించాడు.

ఏ మానవులైతే శరీరం చక్కగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే, మనస్సు స్వాధీనంలో ఉన్నప్పుడే విశ్వరూపుడైన నన్ను స్మరిస్తారో వారినే నేను సదా రక్షిస్తాను. వారు దేహత్యాగాన్ని చేయబోయే సమయంలో, స్పృహలేకుండా కట్టె వలె, రాయివలె నిశ్చేష్టులై ఉన్నా కూడా, నేనే వారి చివరి దశను తెలుసుకుంటాను. నేను స్వయంగా వచ్చి, వారిని నా దివ్యధామానికి చేర్చుకుంటాను అని తన అపార కరుణాకటాక్షాలతో అనుగ్రహించాడు. అందుకే వేంకటాచలక్షేత్రం పరమపావనమైనది. మహత్తు కలిగినది, సదా దర్శనీయమైనదిగా విరాజిల్లుతున్నది.

శ్రీవైకుంఠంలో భాగమైన శ్రీవేంకటాచల క్రీడాపర్వతంపై, 'శ్రీవైకుంఠవిరక్తాయ స్వామిపుష్కరిణీ తటే' అని అన్నట్లు, శ్రీమన్నారాయణుడు స్వయంభువుడు. సాలగ్రామదివ్య అర్చావతార రూపంలో కొలువై, కోరిన వరాలందించే కోనేటి రాయడుగా, భక్తులను కటాక్షిస్తున్నాడు. శ్రీవారికి అత్యంత ప్రాచీనకాలం నుండి కూడా భగవాన్ విఖనసమహర్షి ప్రవచించిన శ్రీవైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా సమస్త ఆరాధనలు జరుపబడుతున్నాయి. తిరుమలలో శ్రీవారికి ప్రీతికరమైన సంప్రదాయంలో జరిగే కైంకర్యాల యొక్క తాత్త్వికతనే 'శ్రీలక్ష్మీ విశిష్టాద్వైత' విధానంగా, 10వ శతాబ్దానికి చెందిన వైఖానస అర్చకులు, శ్రీమాన్ శ్రీనివాసదీక్షితులవారు శ్రీవారినిగూర్చి పేర్కొన్నారు.

**లక్ష్మీవిశిష్టః యత్రమతే తత్ లక్ష్మీవిశిష్టాద్వైతమ్॥**

లక్ష్మితో కూడి విగ్రహరూపంలో ఉన్న శ్రీమన్నారాయణుని అర్చించడమే, మోక్షప్రాప్తికి రాజమార్గమని లక్ష్మీ విశిష్టాద్వైతం సిద్ధాంతం. ప్రారంభంలో శ్రీవారి దివ్యఅర్చావతారరూపంతో పూజలు జరుపబడి, తిరుమల క్షేత్రం 'ఏకబేరఆలయం'గా ప్రశస్తి చెందినది.

**జూన్ నెల 7, 8, 9 తేదీలలో**
**తిరుమలలో జ్యేష్ఠాభిషేకం సందర్భంగా....**

**సాలంబం సుగుణం శ్రేష్ఠం సకలం కౌతుకార్చనం।**
**సకామానాం సముచితం సంసారా శ్రమీణాం సదా॥**

అని భృగుప్రోక్త క్రియాధికారం పేర్కొంటోంది. కోరికలు గల గృహస్థులకు ఎల్లప్పుడు సాలంబం, సగుణం అయిన కౌతుకమును అర్చించడమే శ్రేష్ఠం.

శ్రీవారి మూలవిరాట్‌రూపంలో దివ్యమైన సాన్నిధ్య శక్తిని, కౌతుకరూపంలో ఉన్న విగ్రహమునందు నిత్యం ఆవాహనం చేసి, విధిపూర్వకంగా అరాధన చేయాలి. ఇది 'ఐహిక ఆముష్మిక' ఫలప్రదంగా చెప్పబడింది. అంటే ఎటువంటి భౌతికమైన కోరికలు లేక మోక్షాన్ని కోరి స్వామిని సేవించేవారు. అలాగే తమ ఇష్ట కామ్యార్థసిద్ధికోసం స్వామిని దర్శించేవారు. ఇరువర్గాలవారి కొరకు తప్పనిసరిగా కౌతుకమూర్తి ఆరాధన జరపాలని వైఖానస ఆగమం పేర్కొన్నందు వలన, తిరుమలలో 614వ సంవత్సరంలో, పల్లవరాణి 'సామవై పేరుందేవి' ద్వార, వెండి విగ్రహమైన, శ్రీభోగశ్రీనివాస మూర్తి బహూకరించబడి, ఇది కౌతుకబేరంగా ప్రతిష్ఠగావించబడింది. క్రమేపి ఆలయంలో ఉత్సవాలను జనరంజకంగా నిర్వహించటానికి 1339 సంవత్సరంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారి పంచలోహవిగ్రహాలు ప్రతిష్ఠించబడినాయి.

స్నపనబేరంగా ఉభయదేవేరుల సమేతంగా శ్రీఉగ్రశ్రీనివాసమూర్తివారు, బలిబేరంగా శ్రీకొలువుశ్రీనివాసమూర్తివారికి నిత్య పూజలు జరుపబడుతున్నాయి.

శ్రీవారి ఆలయంలో 'నిత్యకల్యాణం-పచ్చతోరణం' అన్న చందంగా, ఏటా 365 రోజులకు గానూ, సుమారు 470 ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా, నేత్రపర్వంగా నిర్వహింపబడుతున్నాయి. వైఖానసాగమోక్తంగా జరుపబడే ఈ ఉత్సవాలలో భాగంగా, శ్రీమలయప్పస్వామివారికి అభిషేకాలు, స్నపన తిరుమంజనాలు చేయబడుతాయి.



అయితే, ఈ విధంగా అభిషేకాలు జరుపడం వల్ల బింబముల మూలస్వరూపంలో మార్పులు, అరుగుదల సంభవించే అవకాశం ఉంది. దీని పరిష్కారం కొరకు 90వ దశకంలో శ్రీవారి ఆలయంలో సంవత్సర ఉత్సవంగా 'జ్యేష్ఠాభిషేకం' అనే ఉత్సవం ప్రవేశపెట్టబడి శాస్త్రోక్తంగా నిర్వహింపబడుతున్నది.

**జ్యేష్ఠే మాసితు సంప్రాప్తే జ్యేష్ఠానక్షత్ర సంయుతే।**
**విష్ణోరేవ విశేషస్స్యాత్సుగంధం తైలమాహరేత్॥**

**-భగవాన్ భృగుః (ప్రకీర్ణాధికారః)**

జ్యేష్ఠమాసంలో, చంద్రుడు జ్యేష్ఠానక్షత్రంతో కలిసి ఉన్న పూర్ణిమనాడు, దేవదేవుడైన విష్ణువు యొక్క విగ్రహమునకు విశేషమైన సుగంధతైలమును సమర్పించాలని భృగువు ప్రకీర్ణాధికారంలో పేర్కొన్నాడు. దీనినే 'సుగంధతైల సమర్పణ ఉత్సవం'గా క్రియాధికారంలో చెప్పబడినది. ఈ ఉత్సవాన్ని వైఖానసాగమోక్తంగా నిర్వహించటం వల్ల విష్ణువు యొక్క దివ్య అర్చావతారం అమితమైన తేజస్సుతో వెలుగొందుతుందని క్రియాధికారం తెలియజేస్తున్నది. తిరుమలలో జ్యేష్ఠాభిషేకాన్ని జ్యేష్ఠ శుక్ల త్రయోదశినాడు ఆరంభించి, జ్యేష్ఠ శుక్ల చతుర్దశి మరియు జ్యేష్ఠపూర్ణిమ నాడు అంతమయ్యే విధంగా మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించబడుతున్నది. జ్యేష్ఠాభిషేక మహోత్సవానికి 15 రోజులు ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తు లైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి గత సంవత్సరం సమర్పించబడిన స్వర్ణకవచములు సడలింపు చేస్తారు.

**'పరిలిఖిత'మితి మంత్రేణ కవచం పరిశోధయేత్।**
**జీర్ణే భిన్నే చ కవచే శిల్పినైవ సుసన్నయేత్॥**

**(ప్రకీర్ణాధికారం - భగవాన్ భృగు)**

ఈ ఉత్సవ నిర్వహణకు ప్రత్యేకంగా 'కంకణ భట్టర్' అని పిలువబడే వైఖానస అర్చకునికి ప్రధానాచార్యునిగా బాధ్యతలు ఇవ్వబడుతవి. ప్రకీర్ణాధికారంలో చెప్పబడిన విధంగా ఆచార్యస్వామి ఉత్సవమూర్తుల మీదున్న స్వర్ణకవచమును 'పరిలిఖిత...' అను మంత్రంతో చక్కగా పరిశోధన చేయవలెను. అటుపై ఆ స్వర్ణకవచములలో ఏవైనా లోపములుంటే, వాటిని సడలింపు చేసి,

సుశిక్షితుడైన శిల్పిచే వాటిని సరి చేసిసిద్ధంగా ఉంచుకోవాలని శాస్త్ర వచనం.

జ్యేష్ఠాభిషేకం మొదటిరోజు, శ్రీవారికి మాధ్యాహ్నిక ఆరాధన అయిన తర్వాత, శ్రీమలయప్ప స్వామి వారిని, ఉభయదేవేరి సమే తంగా విమానప్రాకారప్రదక్షిణగా, సంపంగి ప్రాకారంలోని యాగ శాలలో 'అష్టోత్తర శతకలశ స్నపన తిరుమంజనం' అనే వైదికక్రియను 108 కలశాలతో నిర్వహిస్తారు. కల్యాణమండపంలోని యాగ శాలకు వేంచేపు చేస్తారు. వైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా దేవతా ప్రార్థన, విష్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యా హవచనం, అంకురార్పణం, రక్షా బంధనం, అగ్నిప్రణయనం మొద లైన క్రియలను శాస్త్రోక్తంగా, వేద మంత్ర పురస్సరంగా నిర్వహిస్తారు. తదుపరి, ఈ ఉత్సవానికి సర్కార్ (తి.తి.దేవస్థానం) వారి తరపున



## వజ్రాలు పొదిగిన కవచ వృత్తాంతం, ఆధునిక కాలంలో ఒక అద్భుతం!



కలికాలంలో అందునా ఈనాటి వైజ్ఞానిక రోజుల్లో అద్భుతమైన ఆధ్యాత్మిక మైన వృత్తాంతములు కనుమరుగవుతాయి. కాని నిజానికి వాటి తాలుకు ఆధ్యాత్మిక కదలికలు ఎవరికైతే దైవంపై అధిక విశ్వాసం ఉందో వారు తరచు అనుభవం చెందుతూ ఉండడం ఒక యాదృచ్ఛిక ఘటనగా అనుకోవాలి. అటువంటి సంఘటనే చరిత్రలో ఈ మధ్యలోనే పొందుపరచడం జరిగింది.

అదే కొల్లెగాల వీరన్న గాథ. ఇతను కర్ణాటకలోని మైసూరు దగ్గర నివసించే ఒక వ్యాపారవేత్త. ఇతడు పరమ విష్ణుభక్తుడు. ఇతనికి ఒకసారి శ్రీమన్నారాయణుడు కనిపించి వీరన్న శెట్టిని నాకు వజ్రాలు పొదిగిన కవచాన్ని ఇవ్వమని ఆదేశించాడు.

ఆ వ్యాపారి అదేవిధంగా వజ్రాలు పొదిగిన కవచాన్ని తయారు చేసి మేల్‌కోట్‌లో ఉన్న శ్రీచెలువ నారాయణస్వామికి సమర్పించాడు. కాని, ఆ కవచం ఆ విగ్రహానికి సరి పోలేదు. అచట అర్చకులు వీరన్నను కవచాన్ని తీసుకొని, శ్రీరంగానికి వెళ్లమన్నారు. వీరన్న అదేవిధంగా కవచాన్ని శ్రీరంగంపెరుమాళ్ అయిన ఉత్సవమూర్తులకు అర్పించాడు. అయినను ఆ కవచం, స్వామివారికి సరిపోకపోతే, వారు వీరన్నను తమిళనాడులోని కంచి వరదరాజస్వామికి సమర్పించమని సలహా ఇచ్చారు. అచటి అర్చకులు వరదరాజస్వామికి అలంకరింపజేయడానికి ప్రయత్నించగా అది సరిపోలేదు. వీరన్న దుఃఖితుడై ఏమిటీ పరీక్ష! అని స్వామిని తలచాడు. అప్పుడు అచ్చటి అర్చకులు బాగా ఆలోచించి వీరన్నను ఆ కవ చాన్ని వేంకటాచలమునకు తీసుకువెళ్లమని చెప్పి, కలియుగంలో ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరుడే అని తెలియ చెప్పారు. వీరన్న తన యాత్రను దక్షిణాపథంలో జరిపి మలయప్ప స్వామికి ఆ కవచాన్ని సమర్పణ చేశాడు. అద్భుతాలలో అద్భుతంగా ఆ కవచం సరిగ్గా సరిపోయింది. అది మలయప్ప స్వామి కోసమే చెసినట్లుగా అనిపించింది. వీరన్న మరియు అర్చకులు తమ కళ్ళ ఎదుటే జరిగిన ఈ ఆశ్చర్య సంఘటన జరిగిన కథ దశదిశల వ్యాపించింది. ఇందుకు ఈ జరిగిన ఘటనకు సాక్ష్యంగా వజ్రఖచితకవచపు పాదముల మీద కన్నడలిపిలో కొల్లేగాల వీరన్న శెట్టి సేవ అనే పదము అగుపిస్తుంది.

స్వామివారి యొక్క మహిమలు వర్ణనాతీతం. మరియు భక్తుడు స్వామి కృపలేనిది ఏమి చేయజాలడు. మనయొక్క జన్మ స్వామి కృపే కదా! ఎవరైతే తిరుమలలో స్వామి దర్శనాన్ని కోరుకుంటారో అది కేవలం మన నెరవేరికే కాదు. అది స్వామివారి కృప మాత్రమే. స్వామి కనుక మనలను కటాక్షిస్తే మనం అందరం వారి అనుగ్రహానికి పాత్రుల మవుతాము.

కార్యనిర్వహణాధికారి దంపతులకు సంకల్పం చెప్పబడుతుంది. యాగశాలలో 108 కలశములను, 9 కలశములను ఒక అమరికగా- 4 వరుసలలో ఉంచుతారు. ఇలాంటి వరుసలు మూడుంటాయి. మధ్యలో ఉన్న ప్రధాన కలశంలో వరుణదేవతను ఆవాహన చేసి ఉపచార సమర్పణ చేస్తారు. ప్రధానహోమం, ప్రాయశ్చిత్తహోమం, అంతహోమాలను పూర్ణాహుతి నిర్వహించి అగ్ని ఉపస్థానం చేయడంతో హోమకైంకర్యం సమాప్తి అవుతుంది. అనంతరం శ్రీవారి ఉత్సవమూర్తులకు 12 రకాల ద్రవ్యాలతో మరియు పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపు, చందనాదులతో విశేష స్నపన తిరుమంజనం జరుగుతుంది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీమలయప్పస్వామివారిని, అతివిలువైన, ముగ్ధమనోహరమైన వజ్ర కవచంతో అలంకరించి, నాలుగు తిరుమాడావీథులలో ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఇలాగే మిగతా రెండురోజులు ఉదయంపూట అష్టోత్తర కలశస్నపనం మరియు 2వ రోజు సాయంత్రం ముత్యపుకవచం, 3వ రోజు సాయంత్రం స్వర్ణకవచంతో తిరువీథి ఉత్సవం జరుగుతుంది. మూడవరోజు ఉదయం స్నపనం తర్వాత కవచ ప్రతిష్ఠ జరుగుతుంది.

ప్రక్షాల్య పంచగవ్యేన జలేన పరిశోధయేత్।
కృత్వాపి వాస్తుశుద్ధిం చ యథోక్తా నిష్కృతిం చరేత్॥ (ప్రకీర్ణాధికారం)

మూడవరోజు ఉదయం అష్టోత్తర కలశస్నపనంలో భాగంగా హోమాదివైదికక్రియలు పూర్తైన పిదప, పంచగవ్యమునకు (గోక్షీరం, గోదధి, గోఘృతం, గోమూత్రం, గోమయం)అధిదేవతను ఆవాహనం చేసి ఉపచార సమర్పణ గావించి, అనంతరం కవచమును వాస్తు హోమం చేస్తారు. పంచగవ్యంతో కవచములకు ప్రోక్షణచేసి, వాస్తు శుద్ధి జరిపి స్వర్ణకవచములను శ్రీవారి ఉత్సవమూర్తులకు సమర్పించుటకు యోగ్యతను కలుగజేస్తారు (పవిత్రీకరిస్తారు). పంచదశ సూక్తములతో అభిమర్శన క్రియను కవచములకు నిర్వహించి, తదుపరి 'విష్ణోర్నుకం....' అను మంత్రంతో స్వర్ణ కవచములను, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారికి, దృఢంగా, స్థిరంగా పూర్వం ఉన్నట్లుగానే సమర్పించబడుతుంది.



సంవత్సరం పూర్తిగా శ్రీవారి ఉత్సవమూర్తుల దివ్యతిరుమేను స్వర్ణకవచములతో శోభిల్లుతూ ఉంటుంది. కాని, జ్యేష్ఠాభిషేక ఉత్సవ సమయంలో మాత్రమే స్వామివారి యొక్క నిజమైన అర్చారూపదర్శనం భక్తులకు కలుగుతుంది. అలాగే సాధారణంగా అభిషేక ద్రవ్యాలైన పాలు, పెరుగు మొదలైనవి స్వామివారి యొక్క పాదాలకు అభిషేకం చేస్తారు. ఎందుకంటే ఉత్సవమూర్తులు స్వర్ణకవచాలతో ఉంటారు కాబట్టి, అభిషేకం శిరసాదిగా చేయబడదు. కానీ, ఈ జ్యేష్ఠాభిషేక సమయంలో మాత్రమే శ్రీ మలయప్పస్వామివారికి శిరసాది పాద పర్యంతం అన్ని ద్రవ్యాలతో అభిషేకం జరుపుతారు.

ఆ యా మూర్తుల రూపమునకు తగినట్లు, చక్కగా సరిపోవునట్లుగా కవచములను సర్వప్రయత్నంతో సమకూర్చుకుని, బింబములను రక్షించుకోవలెనని, ఇదియే 'జ్యేష్ఠాభిషేకం' అనే ఉత్సవం యొక్క పరమార్థంగా భృగువు ప్రకీర్ణాధికారంలో చెప్పారు. అలాగే మూడవదినం స్వర్ణకవచ సమర్పణకు ముందు, శ్రీవారిమూర్తులకు సుగంధ తైలమును సమర్పించి, నిజతిరుమేనుపై చందనం, ఆపై పల్చటి శ్వేత వస్త్రం ధరింపజేసి, కవచ ధారణ చేస్తారు. ఇటువంటి మహత్తరమైన జ్యేష్ఠాభిషేక మహోత్సవం, తిరుమలలో అంగరంగ వైభవంగా, నేత్రపర్వంగా మూడురోజులపాటు నిర్వహించిన కంకణభట్టర్ ఆచార్యులకు, చివరిరోజు సాయంత్రం 'అర్చక బహుమానం' అనే దేవస్థాన మర్యాదలను చేయటంతో క్రతువు పూర్తి అవుతుంది.

ఈ ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ, శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యాశీసులతో, అన్ని కార్యాలు నిర్విఘ్నంగా నెరవేరుతాయి. వారికి ఉన్న దీర్ఘకాల రుగ్మతలు, వ్యాధులు తొలగిపోతాయి. సమస్తమనోవాంఛలు సిద్ధిస్తాయి. దేహావసానమున, శాశ్వతమైన విష్ణుసాయుజ్యం లభిస్తుందని, క్రియాధికారంలో భృగుమహర్షి పేర్కొన్నాడు.

ఈ సంవత్సరం 2017 జూన్ నెల 7, 8, 9 తేదీలలో తిరుమలలో జ్యేష్ఠాభిషేకం నిర్వహిస్తారు.

# శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

## నారాయణవనం

– డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి

**నారాయణవనం బ్రహ్మోత్సవాల సందర్భంగా.....**

**ఆకాశరాజు కుమార్తె శ్రీపద్మావతీదేవిని శ్రీనివాసుడు వివాహం చేసుకున్న పవిత్రప్రదేశం నారాయణవనం. ఈ క్షేత్రంలో నెలకొన్న దైవం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి.**

**ఈ ఆలయ ప్రాభవ ప్రాశస్త్యాలు శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలో విశేషంగా వివరించబడ్డాయి. ఈ ఆలయం ఆకాశరాజు కట్టించినట్లు కథనం. తర్వాత, శిథిలాలయాన్ని క్రీ.శ.1245లో వీరనరసింగదేవయాదవరాయలు జీర్ణోద్ధరణ చేశాడు. ఈ ఆలయాన్నే పెనుగొండ వీరప్పన్న క్రీ.శ.1541- 1542 సం॥ల మధ్యకాలంలో పునఃనిర్మించినట్లు చరిత్ర. 25-03-1943లో ఆల్వార్ (రాజస్థాన్) రాజావారి కార్యనిర్వాహకుడు సూరజమల్ కరవా ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించాడు. ఈ ఆలయం 29-4-1967లో తిరుమల తిరుపతి దేవస్థానం అధీనంలోకి వచ్చింది.**

### శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి

ఈ ఆలయంలోని అర్చామూర్తి శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి తూర్పుముఖంగా ఉంటారు. వక్షఃస్థలంలో శ్రీలక్ష్మీదేవి నివసించి ఉంటుంది. స్వామివారు నడుముకు దశావతార వడ్డాణం, భుజానికి సాలగ్రామాలు, చక్రం, ఖడ్గం, చేతిలో వేట ఖడ్గం ధరించి ఉంటారు.

### శ్రీ పద్మావతీ అమ్మవారు

ఈ ఆలయంలో అమ్మవారు ఒక ప్రత్యేక ఆలయంలో నెలకొని ఉన్నారు. అమ్మవారి ఆలయ విమానమును విష్ణుచంద్ర విమానము అంటారు. ప్రధాన ఆలయమునకు నైఋతి దిశ యందు అమ్మవారి సన్నిధి కలదు. శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయ ముఖ ద్వారం దగ్గర కుడివైపు సరస్వతీదేవి, ఎడమవైపున కల్పవృక్షం, కామ ధేనువు భక్తకోటికి దర్శనమిస్తూ ఉంటాయి.

శ్రీపద్మావతీ అమ్మవారు తూర్పుముఖంగా పద్మపీఠంపై చతుర్భుజ సహితంగా ఆసీనురాలై భక్తకోటికి దర్శనమిస్తూ ఉంటుంది.



ఆలయం చుట్టూ ప్రదక్షిణమార్గం, దాని చుట్టూ మరొక ప్రాకారం, ఆరుబయట మరొక ప్రదక్షిణమార్గం ఉన్నాయి.

ఆలయ వాయవ్యదిశలో ఆండాళమ్మ (గోదా దేవి) ఆలయం ఉంది. ఆలయఉత్తరద్వారం ప్రతి సంవత్సరం వైకుంఠద్వాదశి భక్తులకోసం తెరచి ఉంచుతారు.

### కోదండరామస్వామి, రంగనాథస్వామి

ఆలయంలో ఈశాన్యం వైపు ఉన్నమందిరంలో శ్రీరంగనాథస్వామివారు, శ్రీ కోదండరామస్వామివార్లు వేంచేసి ఉన్నారు. ఆ ప్రక్కనే ఉన్న మండపంలో విష్వక్సే నులు, తిరుక్కచ్చినంబి, తిరుమంగైఆళ్వారు, మణవాళముని విగ్రహాలు ప్రతిష్ఠించబడియున్నాయి.

తూర్పుముఖంగాయున్న శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండు పెద్ద రాతిగడపలు దాటి లోపలకు వెళితే రెండువైపులా వాహనమండపాలు దర్శనమిస్తాయి. ఆగ్నేయ దిశలో వంటశాల ఏర్పాటైయున్నది. అటువైపు నుండి దక్షిణ దిశగా ప్రయాణిస్తే ఒక పెద్ద మండపంలో పన్నిద్దరాళ్వారులు భక్తిభావం అతిశయిల్లునట్లు కొలువుదీరి మనకు కనిపిస్తారు.

ప్రధాన ఆలయానికి ముందుభాగంలో రాగితొడుగు తొడిగిన ధ్వజస్తంభం, దాని ముందు బలిపీఠం కనిపిస్తాయి. ధ్వజస్తంభమునకు ఆనుకొని ఉన్న గరుడమండపంనందు గరుడ ఆళ్వారు స్వామికి అభిముఖంగా సన్నిధి చేసి ఉన్నారు.

### ఆలయగోపురాలు

ఆలయ ప్రధాన ప్రధానరాజగోపురాన్ని ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు కట్టించాడు. ఇది ఏడంతస్థులు, 150 అడుగుల కలిగి ఉంది. రెండవగోపురం వీరనరసింగ దేవ యాదవరాయల నిర్మితం. ఇది మూడంతస్థులు, అయిదు కల శాలు కలిగి ఉంది. ఆలయంలో నాలుగుమూలల బలిపీఠాలు ఉన్నాయి. స్వామివారి ఆలయంలో పంచబేరాలు, ఆండాళ్ తల్లి విగ్రహం, శ్రీభక్తాంజనేయస్వామి అత్యంత శోభాయమానంగా దర్శనమిస్తారు.

### ఉత్సవాలు

ఈ ఆలయంలో వైఖానస ఆగమం ప్రకారం అన్ని ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు సౌరమానం ప్రమాణం. స్వామివారికి ప్రతినిత్యం సుప్రభాతం, అర్చన, నైవేద్యం, ఏకాంతసేవ జరుగుతాయి. ప్రతి శుక్రవారం అభిషేకం ఉంటుంది. కల్యాణోత్సవం (ఆర్జితం) తెప్పోత్సవం, బ్రహ్మో త్సవం, పవిత్రోత్సవాలు అతిఘనంగా జరుగుతాయి.

ప్రధానాలయానికి ఎదురుగా ఆంజనేయస్వామివారి ఆలయం ఉన్నది. దానికి దక్షిణంగా పరాశరేశ్వరస్వామి వారి ఆలయం ఉన్నది. చిత్రాంగి కోటకు వెళ్ళేదారిలో మొట్టమొదట శ్రీ వీరభద్ర స్వామి వారి ఆలయం దర్శన మిస్తుంది. చిత్రాంగి కోట ముఖద్వారంలో మనకు శక్తి వినాయకస్వామి వారి ఆలయం దర్శనమిస్తుంది.

### శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయం

ఉద్యానవనంలో శ్రీనివాసుని దర్శించిన పద్మావతి మోహవివశురాలౌతుంది. ఆమె తల్లిదండ్రులు దైవజ్ఞులను ప్రశ్నించగా వారు అగస్త్యేశ్వరస్వామివారికి అభిషేకం చేయించ మని, అంతా శుభమే జరుగుతుందని చెబుతారు. అప్పుడు ఆకాశరాజు ఈ ఆలయంలో అగస్త్యేశ్వర స్వామివారికి అభి షేకం, పూజలు చేయి స్తాడు. ఈ అగస్త్యేశ్వర స్వామి ఆకాశరాజు ఇలు వేలుపని చెబుతారు. అరుణానది దక్షిణ తీరంలో వెలసిన మరి యొక అతిముఖ్యమైన ఆలయం అవనాక్షమ్మ దేవాలయం. ఈ అమ్మ వారు గ్రామదేవత. ఇక్కడ ఆదిపరాశక్తి అవనాక్షమ్మ రూపంలో వెలసింది.



*(గతసంచిక తరువాయి భాగం...)*

**హైమసరోజాంగ! అలమేలుమంగ!**
**జీమూత సంకాశ! శ్రీ వేంకటేశ!**
**వనమాలి అవధారు! వరదానశీలి!**

దక్షిణభారతదేశంలోని పాండ్యమండలంలో 'శ్రీవిల్లిపుత్తూరు' ఒక నగరం. ఆ నగరంలోని ప్రముఖాలయం 'వటపత్రశాయి ఆలయం'. ఆ పురంలోనే బ్రాహ్మణవంశంలో, జ్యేష్ఠమాసంలో గంధవహతారలో గరుత్మంతుని అంశతో ఒక వరపుత్రుడు జన్మించాడు. అతడే **'భట్టనాథుడు'**.

బృహస్పతిని నిరసించే వైదుష్యవిశారదుడు. సకలాశ్రయుడు. నిరుపమకారుణ్యనిధి. వైష్ణవ పూజావివర్ధనుడు. ఆ కారణంవల్ల ఆ మహాను భావునికి **'విష్ణుచిత్తుడ'**నే పేరే ప్రఖ్యాతిలోకి వచ్చింది.

విష్ణుచిత్తుడు వటపత్రశాయి భక్తుడు.

శ్రీవైష్ణవుడైన విష్ణుచిత్తుడు స్వామికి ఏ సేవ చేస్తే బాగుంటుందో ఆలోచించేవాడు. స్వామి ఏ సేవ కారణంగా సంతృప్తిపడతాడో తనలో తానే తర్కించుకొనేవాడు. మహావిష్ణువు దశావ తారాలను పదే పదే స్మరించుకొనేవాడు. అత నికి నచ్చినకథ మధురలో కృష్ణుడు పుష్పలావ కుని ఇంటికి వెళ్ళిన వృత్తాంతం.

సకలయాగాలు చేయడంకంటె వాసనల తోడి విరులపూజ సర్వశ్రేష్ఠమని విష్ణుచిత్తుడు నిశ్చయించుకొన్నాడు. స్వామికి సుమదామ కైంకర్యం చేస్తాను అని నిశ్చయించుకొని నందనవనం, అశోకవనం, ఖాండవవనం, మధువనాలమించే విధంగా ఒక ఉద్యానవనం నిర్మించాడు.

రోజూ తోటలోని రకరకాల పూలుకోసి మాలలుకట్టి విష్ణుచిత్తుడు వటపత్రశాయికి సమర్పించేవాడు. ఆ విష్ణుచిత్తునికి మరే చింతా లేదు బ్రహ్మవిద్యాచింత తప్ప.

ఆ కాలంలో సంపదలతో తులతూగే పట్టణం 'మధుర'.

అది అలకాపురంలాంటిది. ఆ పురాధిపతి దీపకవల్లభదేవుడు. ప్రజాసంక్షేమపరుడు.

ప్రజలకష్టసుఖాలు తెలుసుకోవడానికోసం చీకటివేళ నల్లటి గొంగడి ముసుగుతో అంతః పురం వదలి వీథివీథులలో తిరిగేవాడు. తన పట్టణంలోని ప్రజలు ఏమి మాట్లాడుకొంటారో ఆలకించేవాడు. అలా తిరిగి తిరిగి అంతఃపురం చేరుకొందామని అనుకొని ఒక అరుగుదగ్గరికి వచ్చాడు. కూర్చొన్నాడు.

ఆ అరుగుమీదున్న వ్యక్తితో మాటలు కలిపాడు. తాంబూలమిచ్చాడు.

'అయ్యా! ఎక్కడనుండి మీరాక! ఒంటరిగా ఇక్కడ నిద్రపోతున్నారెందుకు? అని ప్రశ్నించాడు.

'అయ్యా? మీరెవరో తెలియదు. అయినా చెబుతాను. ఈ లోకంలోనూ, పరలోకం లోనూ సుఖాలు అబ్బాలని, పాపాలు పటాపంచలు కావాలని మహిత విజ్ఞానం మనసుకు పట్టాలని గంగానదీప్రాంతానికి వెళ్ళాను. గంగాస్నానం చేశాను. ఇపుడు మా ఊరికి తిరిగి వెళుతున్నాను. ఈ వేళ ఎండవేడిమి తట్టుకోలేక బడలికతో ఈ అరుగుమీద విశ్రాంతి తీసు కుంటున్నాను' అని జవాబిచ్చాడు.

రాజుకు కుతూహలం హెచ్చింది.

'అయ్యా! కాశీతీరంలో ఎందరో జ్ఞానులను కలుసుకొని ఉంటారు. అక్కడి విశేషాలు మీకు తెలిసే ఉంటాయి. మీరు కృషిచేసి అవగతం చేసుకొన్న విశేషాలు ఏవయినా ఉంటే చెప్పండి. వినాలని నా కుతూహలం' అన్నాడు.

ఆలాగే. నేను 'వర్షార్థమష్టౌ' అనే శ్లోకం చదివాను. అర్థవిశేషాలు తెలుసుకొన్నాను. మీకు చెబుతాను. వినండి. "సంవత్సరంలో వానాకాలంకోసం తతిమ ఎనిమిదినెలలు సంపా

13



# పరమయోగివిలాసం

- ఆచార్య కె. సర్వోత్తమరావు

దించ వలె. రాత్రికోసం పగటివేళనే వస్తువులను చేర్చుకోవలె. ముసలి తనంచేత బాధపడకుండా వయసులోనే అన్ని యత్నాలు చేసుకోవలె." ఇదే నేను తెలుసుకొన్న పరమార్థమన్నాడు.

రాజు ఆలోచించాడు.

నిజమే. కర్మానుగుణంగా కోరికలు. ఆ కోరికలకు అను గుణంగా సంపదలు. సంపదలకు కారణమైన అదృష్ట ఉపాయం ఏమిటో తెలుసుకోవాలి అని నగరికి వెళ్ళాడు.

రాత్రి విశ్రమించాడు. సూర్యోదయమయింది.

సంధ్యావందనాదులు పూర్తి చేసుకొని సభాంగణానికి వచ్చాడు. పురోహితుని పిలువనంపాడు.

పురోహితుడు వెనువెంటనే వచ్చాడు. అతనితో తన అంత రంగాన్ని ఆవిష్కరించాడు.

'ఆచార్యవర్యా! నేను ఇంతకాలం ధర్మ, అర్థ, కామ సంసిద్ధి కార్యాలు ఎన్నో నియమబద్ధంగానే చేశాను. అయినా అంతిమ పురు షార్థం 'మోక్షం' కదా! ఆ దిశగా నేను ఆలోచించలేదు. దీనికి ఉపా యమేమిటి?' అన్నాడు.

"రాజేంద్ర! మీరు సూక్ష్మాంశాలు ప్రస్తావించారు. దేవతలకు కూడా అంతుపట్టని అంశం. అయినా మీరు సామాన్యులు కారు శ్రీహరి పాదమతులు. నాకు తెలిసినంతవరకు చెబుతాను. వేదాలు పరమ ప్రమాణాలు. వేదార్థాలను విశ్వసించి పాటిస్తే మోక్షం తథ్యం" అన్నాడు.

రాజు ఆలోచించాడు. ఇది ఒకరితో తేలేది కాదు. నిర్ణ యించడానికి సామాన్యులు పనికిరారు. దైవానుగ్రహం లేనిదే బోధ పడదు. వాదాలకూ, వివాదాలకూ దీటైన జవాబుకు పరమాత్ముడే సాక్షి' అంటూ సభలో 'పెద్దడబ్బు' సంచి పైన కట్టించాడు.

అంతేకాదు. పరతత్త్వనిర్ణయం చేసినవాడే ఈ శుల్కానికి అర్హుడని చాటించాడు. అనేక ప్రాంతాలనుండి పండితులు, శాస్త్రజ్ఞులు వచ్చారు. వారిలో కొందరు కపిల సాంఖ్యవాదులు. కొందరు అక్షపాద మతానుయాయులు. ఇంకా కొందరు భట్టాదులు. వాదనలు మొద లయ్యాయి.

శాస్త్రచర్చ గంభీరంగా సాగిపోతూ ఉంది.

ఒకరు తమ మతం ప్రకటించుకొంటుంటే, మరొకరు 'ఇదంతా మిథ్య మిథ్య' అన్నారు.

ఒకరు కర్మము ప్రధానమంటే కాదన్నారు మరికొందరు. వేదాలను నమ్మనివారు వాదాలు మాకేల అన్నారు కొందరు. అన్యోన్య మత దూషణలు వాడిగా వేడిగాసాగాయి. కొందరికి నిగ్రహం సడలింది.

అసలు సంగతి పక్కకు నెట్టేశారు పండితులు. ఆ సభాంగణ మంతా 'పెరుగు వడ్లు కలిసినట్లుగా' మారిపోయింది. రాజు దిగాలు పడ్డాడు. కర్తవ్యమేమిటో అతనికి అంతుపట్టలేదు. వాదనలు రోజూ సాగుతూనే ఉన్నాయి.

సత్యనిరూపణ కానందుకు రాజు చింతించాడు.

....... ....... .......

అది 'విల్లిపుత్తూరు' (ధన్వినగరం).

ఆ దివ్యదేశంలోని 'వటపత్రశాయి' తన సేవార్థం వస్తున్న విష్ణుచిత్తులవారిని చూచారు.

"వత్సా! మధురలో పాండ్యరాజు కొలువుకూటంలో "డబ్బు మూట' ఒకటి వేలాడగట్టినాడు. ఆ డబ్బు నీవు తీసుకో" అన్నాడు. అప్పటికే మధురలో జరిగే శాస్త్రచర్చలు విని ఉన్నాడు విష్ణుచిత్తుడు. 'స్వామి! నాకు వేదాలు తెలియవు. శాస్త్రాలు అంతుపట్టవు. వేదార్థ సాధకమైన డబ్బుకోసం నేను ఆశించడమా? గునపంపట్టినచేతితో గూఢార్థ దీపితమైన శుల్కాన్ని పట్టడమా? నాకు వేదాంతచర్చలేవీ తెలియవు. నీ పాదపద్మమే నాకు సర్వస్వం' అన్నాడు.

వటపత్రశాయి చిరునవ్వుతో

'సందేహిస్తున్నావెందుకు? నీ భారం మోసేవాణ్ణి నేను కదా! నీ కేల చింత? నేను నీ ఎదలో నిలిచి వేదార్థాలను నీ నోట పలికి స్తాను. విశదం చేస్తాను. అంతేకాదు ఆ శుల్కం నీకు దక్కేలా చేస్తాను. నీవు అక్కడికి వెళ్ళి వాదించి గెలిచి మరల ఇక్కడికి వద్దువుగాని' అన్నాడు.

విష్ణుచిత్తునికి నమ్మకం కుదిరింది. సర్వం సర్వేశుడైనప్పుడు బెంగ ఎందుకనుకొన్నాడు. శ్రీరాముని ఆనతో ఆంజనేయులవారు సముద్రం దాటినట్టు విల్లిపుత్తూరునుండి బయలుదేరి 'వేగవతి' నదిని దాటాడు.

అలనాడు కృష్ణుడు ముష్టికాసురులను చంపడానికోసం మధురకు వెళ్ళినట్లు విష్ణుచిత్తులు పరమతవాదాల ఖండనంకోసం మధురలో అడుగుపెట్టాడు. కొలువుకూటం చేరాడు.

వల్లభదేవుడు తనకేసి వస్తున్న విష్ణుచిత్తులవారిని చూశాడు. పరీక్షిత్తు శుకయోగిరాకకు పరవశించినట్లు పరవశించాడు. సింహా సనం దిగి ఎదురేగి స్వాగతం పలుకుతూ పురోహితులతో తానూ విష్ణుచిత్తుల పాదాలమీద వాలాడు. సగౌరవంగా ఉన్నతాసనంలో కూర్చోపెట్టాడు. అర్ఘ్యపాద్యాదివిధులు నిర్వహించాడు. ఈ దృశ్య మంతా చూస్తున్న పండితులకు కోపం పట్టలేదు. తమలో తాము గుసగుసలాడుకొన్నారు.

'ఏమిటీ? ఈ వింత పోకడ. ఈ సభలో వేదవేదాంతాలు చదివినవారు అసలు లేరా? వేదవేదాంతాలలో చెప్పినట్లు నడచు

కొనేవారు లేరా? జగత్ప్రసిద్ధులైనవారు లేరా? వీరందరిని 'అజ్ఞులుగా' లెఖ్ఖగట్టడం న్యాయమా? మహారాజు ఒక దాసరిని పెద్ద చేయడమా? మర్యాదలతో మన్ననలకెక్కించడం తగునా? మొన్నటిదాక పరిచారకు డేగా? పట్టె నామాలు పెట్టుకొన్నంతమాత్రాన పెద్దరికం వస్తుందా?

రాజుకు అభం శుభం తెలియదనుకొందాం. తాను వైదికు డైనా పురోహితుడు కూడా ఇలా ప్రవర్తించడమేమిటి? వల్లభదేవుడు నమస్కరించడంలో తప్పులేదు. ఈ 'శుంఠకాయ' తానూ నమస్కరించడ మేమిటి? అన్నీ తెలిసినవారే తికమకపడుతుంటే 'బీరకాయచిక్కుకు' ఈ దాసరి పరిష్కారం చూపుతాడా' అని అసూయతో రుసరుసలాడిన వారు కొందరు.

అయినా వారిలో 'విష్ణుచిత్తులను' చూచి మహాత్ముడని అన్న వారు కూడా లేకపోలేదు. సభలో కలకలం రేగుతుంటే వల్లభరాయలు, పురోహితులు విష్ణుచిత్తులవారితో –

'దాసవత్సల! తుదిమొదలులేని వివాదాలు సాగుతున్నాయి. వీరి నోళ్ళు ముద్రపడే రీతిగా ఈ సభలో పరతత్త్వనిర్ణయం చేయండి. మా వైపు దయచూపండి' అన్నారు.


హరిచిత్తుడైన విష్ణుచిత్తుడు మనసులో వటపత్రశాయిని ధ్యానించాడు. బ్రహ్మ అనుమతితో ప్రాచేతసుడు పరిపూర్ణజ్ఞానుడైనట్టుగా ప్రకాశించాడు. పాంచజన్యసంగంతో ధ్రువునికి సకలవిద్యలూ కరతలా మలకం అయినట్టు వెలిగాడు.

వటపత్రశాయికృపతో విష్ణుచిత్తుల నాలుకమీద అన్ని శాస్త్రాలు, శాస్త్రార్థాలు నాట్యం చేశాయి.

"శ్రీ పురుషోత్తముడే పరతత్త్వం. అతడే ఆది అంతం లేని వాడు, అధికుడు. తనకు దీటైనవాడు ఎవడూ లేనివాడు. సర్వేశ్వరుడు ప్రకృతి జీవులకు లోపల వెలుపల ప్రకాశించేవాడు. అతడే పద్మ ప్రియుడు. వేదాలు కీర్తించే మిథునం' అని వాదించగానే కొలువు కూటం మధ్య వేలాడగట్టిన 'దబ్బులమూట' డబుక్కున అతని పాదాల పడింది.

దుందుభులు మోగాయి. రంభాదులు నాట్యం చేశారు. దేవతలు భూదేవతలు సంతోషించారు. పూలవాన కురిసింది.

వల్లభరాయల ఆనందానికి పట్టపగ్గాలే లేవు.



'ఓ పావనాత్మ! నా పాలిదైవమా! నన్ను కన్న తండ్రీ!' అంటూ పూలమాలతో సత్కరించాడు. పెద్దఏనుగు మీదికి ఎక్కించాడు. చతురంగ బలాల కవాతులతో, పుత్రులతో, మిత్రులతో విష్ణుచిత్తులకు అనుచరుడా అనే విధంగా సేవించాడు. పట్టణమంతా ఊరేగించాడు.

ఈ సుందరోజ్జ్వల దృశ్యాన్ని చూడాలని దేవతాసమూహంతో కమలాదేవితో శ్రీహరి గురుడవాహనమెక్కి కదలి వచ్చాడు.

కుమారుడు బ్రహ్మరథంపై కదలుతుంటే తల్లిదండ్రులు సంతోషపడేవిధంగా ఏనుగుమీద అధిరోహించిన విష్ణుచిత్తులను చూచాడు. విష్ణుచిత్తులవారు గరుడారూఢులైన స్వామిని చూచి పరవశించారు.

'ఆహా! ఏమి నాభాగ్యం. 'పరవస్తు' దర్శనమైంది. విష్ణుపదాన్ని వీక్షించగలిగాను. మహావిష్ణువును సేవించగలిగాను' అంటూ స్వామి లావణ్య సౌందర్యాలకు మోహించినవాడై ఈ దివ్యమంగళాకారునికి దృష్టిదోషం తగులుతుందేమో? అని భయపడి ఏనుగుకు ఇరువైపుల కట్టినగంటలను చేతబట్టి నవరసరాగవర్ణాలతో మంగళాశాసనం చేశాడు.

'శ్రీమాల్యకారునిచే దివ్యపుష్ప
దామముల్ తాల్చి యుద్ధత రంగసీమ
జాణూరమల్లుని సమయించి మిగుల
రాణించు శౌరి దోర్దండంబులకును
వలపల రవికోటి వడకించు కాంతిc
దలుకొత్తుచుండు సుదర్శనంబునకు
నలచెంత ననిదైత్యు లగలు నాదములు
సలుపుచుండెడు పాంచజన్యంబునకును
నపరంజి బొమ్మయో యననొప్పు మేన
నుపమింపcదగి యెదనున్న యిందిరకుc
గెందామరలపస గిలుబాడు పసల
యందంబు గలుగు నీ యడుగుcదమ్ములకుc
బూనికతోడ నెప్పుడు బంటనైన
యేనును నీవును నెరవింత లేక
యొకcగూడియుండెడి యునికి నెంతయును
నెనసియుండంగc బెక్కేండ్లు మంగళము
మంగళంబడి పలుమారు ననంతు
సంగతి మంగళాశాసనంబిట్లు'

విష్ణుచిత్తులు శ్రీమన్మహావిష్ణువు అవతారలీలలను ద్రావిడ భాషలో ప్రబంధాలుగా పాడుతుంటే రమావిభుడు సంతోషించాడు. అంతేకాదు అతనిలో తన దివ్యశక్తిని నిలిపినాడు. శ్రీవిల్లిపుత్తూరులో వటపత్రశాయిగా సాక్షాత్కరించాడు.

తదనంతరం వల్లభరాయలు విష్ణుచిత్తులవారిని సింహాసనంలో కూర్చోబెట్టి కాంచన అంబరభూషణాదులతో పూజ చేశాడు. ఆపై ఏనుగునెక్కి శ్రీవిల్లిపుత్తూరు చేరుకొన్నాడు.

మధురలో జరిగిన వింతలన్నీ తెలుసుకొన్న పట్టణవాసులు విష్ణుచిత్తులవారికి ఎదురేగారు. నమస్కరించారు. నోరార వినుతించారు. కానుకలు సమర్పించారు.

విష్ణుచిత్తులవారితో వటపత్రశాయి సన్నిధికి చేరుకొన్నారు. అపుడు విష్ణుచిత్తులవారు –

'ఓ తండ్రి! ఆనాడు నాలో ఉండి పలికిస్తానని వాగ్దానమిచ్చావు. అలాగే పలికించావు. శుల్కం నీకే అన్నావు. శుల్కం నాదే అయింది. ఇదిగో ఈ ధనం, దంతావళం అంతా స్వామీ నీదే' అంటూ స్వగృహం చేరుకొన్నాడు. ఎప్పటిలాగే ఉత్సవబేరానికి పూల మాలలు అర్పించుకొంటూ విరక్తితో రెండు ప్రబంధాలు రచించాడు. దశదిశల అతని కీర్తి ప్రాకింది.

ఈ కథను ఎవరు వ్రాసినా చదివినా ప్రస్తుతించినా భయాలు పోతాయి. అన్నిటా జయమే అని తిరువెంగళనాథుడు ఫలశ్రుతి చెప్పారు.

*(ఇంకా ఉంది)*

## వైకుంఠపాళి
### :: 19 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వ | సం | 2 త | సే | 3 న | | 4 గా | య | 5 త్రి |
| ల | | పో | | కు | | ర | | పు |
| 6 పా | వ | ని | | లు | | 7 వ | గ్గె | ర |
| | | ధి | | డు | | ము | | వై |
| 8 తం | తు | | 9 ము | | 10 వి | | 11 బ | రి |
| త్రీ | | | 12 త్త | అ | య్య | | డ | |
| 13 పా | ట | | యి | | 14 పు | ష్ప | ప | 15 త్రి |
| లు | | | దు | బా | రా | | | శ |
| 17 డు | లు | ల | వ | | 18 లు | సీ | వా | తి |

# శ్రీవేంకటేశ్వరాలయం, హృషీకేశ్

**– కీ.శే. డా॥ కోరాడ రామకృష్ణ**

**భా**రతదేశస్వాతంత్ర్యపూర్వం 1930 సంవత్సరములో సచ్చిదానంద సరస్వతి స్వామివారు దక్షిణాదినుంచి హిమాలయ క్షేత్ర సందర్శనార్థమై వచ్చే యాత్రికుల కోసం హృషీకేశ్‌లో ఒక ఆశ్రమం నెలకొల్ప సంకల్పించారు. సచ్చిదానంద సరస్వతి స్వామీ తూర్పుగోదావరిజిల్లా రాజోలు తాలుకా అవిడిగ్రామంలో జన్మించారు. ఆయన పరివ్రాజకుడై భారతదేశం అంతా పాద యాత్రతో తిరిగి హృషీకేశ్‌లోనే ఉండి పోయారు. రూ.200/- చందాను వసూలు చేసి 1200 చదరపుగజాల స్థలాన్ని కొని 1942వ సంవత్సరంలో ఈ ఆశ్రమాన్ని స్థాపించారు.

ఆనాటి లోక్‌సభ డిప్యూటీ స్పీకరు మాడభూషి అనంత శయనం అయ్యంగారు, సర్ శొంఠిరామమూర్తి, రాజా ఆఫ్ మునగాల పిళ్ళారిశెట్టి పార్థసారథి, పైడా రామకృష్ణయ్య, గోగినేని వేంకట సుబ్బయ్యగార్లు ధర్మకర్తలుగా ఉన్నారు. తర్వాత 8000 చదరపు గజాల నేలను కొన్నారు. అక్కడ కొన్ని ఆలయాలతో బాటు వేంకటేశ్వరమందిరాన్ని రూ.6,00,000/- అంచనా వ్యయంతో నిర్మించదలిచారు. తిరుమల తిరుపతి దేవస్థానంవారు రూ.31,250/- విరాళంగా ఇచ్చింది. అప్పటి మైసూరు స్టేట్ కోలార్ జిల్లా మాలూరు తాలూకా శివారు పట్టణం వాస్తవ్యులు శిల్పాచార్య చర్లప్పయ్య ఆచార్యగారు ఈ దేవాలయ విగ్రహాలన్నీటిని తయారు చేసి ఇచ్చారు. శ్రీవేంకటే శ్వరస్వామి విగ్రహం 59 అంగుళాల ఎత్తు ఉంటే, శ్రీదేవి భూదేవుల ఎత్తు 49 అంగుళాలు. పంచలోహ విగ్రహాలతో చేసిన ఉత్సవమూర్తుల విగ్రహాలను వారే తయారు చేసిచ్చారు. ప్రారంభదశలో ఆంధ్రాశ్రమం ధర్మకర్తలమండలి అధికార పరిధిలో నిర్వహింపబడింది. ఇచ్చటి చంద్రమౌళీ స్వామి వార్లకు నిత్యం పూజలు నైవేద్యాలు ఉత్సవాలు పండుగలు అన్నీ ఈ మండలి వారి ఆధ్వర్యంలోనే జరిగినవి. తర్వాత ఆలయాన్ని ఆశ్రమంతో సహా తిరుమల తిరుపతి దేవస్థానా నికి 1962లో అప్ప చెప్పబడింది. 1972లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించబడింది. అప్పటి నుండి పండుగలు ఉత్సవాలు జరుగుతున్నాయి. అన్ని పనులను తి.తి.దేవస్థానం వారే జరిపిస్తున్నారు. తిరుమల ఆలయంలో జరిగేటటువంటి ఉత్సవవైభవాలు పూజా పునస్కారాలు ఇక్కడ కూడా నిర్వహించడం జరుగుతోంది.

ప్రతి సంవత్సరం వైశాఖం లేదా జ్యేష్ఠమాసంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగు తాయి. ఈ సంవత్సరం జూన్ 5 నుండి 14వ తేది వరకు జరుగుతాయి.

హృషీకేశ్ ఇప్పటి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని తీర్థక్షేత్రం. గంగాదేవి హిమాలయాల శిఖరాలలో ప్రవహిస్తూ వచ్చి మైదా నాన్ని చేరుకోవడం, హృషీకేశ్ నుంచి 18 మైళ్లదూరంలో ఉన్న హరిద్వారం అని చెప్పవచ్చు. హృషీకేశ్ నుంచి బదరీనాథక్షేత్రం 300 కి.మీ. దూరంలోనూ, హరిద్వార్ 24 కి.మీ. దూరం లోను, గంగోత్రి 250 కి.మీ. దూరంలోను ఉన్న ఈ క్షేత్రాలను సందర్శన చేయవచ్చు. ఆంధ్రాశ్రమం దక్షిణాది నుంచి వెళ్లేవారికి ఎక్కువ అనుకూలంగా ఉంది.

శ్రీవేంకటేశ్వరుని మహిమలు తెలిసిన ఉత్తరాదివారు ఈ ఆలయాన్ని సందర్శిస్తారు. ప్రస్తుత జీవనవిధానం మార్పు రావడానికి ఒకసారైనా హృషీకేశ్‌ను సందర్శించి అక్కడ ఉన్న ఇతర ఆలయాలను దర్శించాలి. ఇక్కడ తిరుమలలో జరిగే విధంగా బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగడం భక్తులను ఆనంద పరవశులను చేస్తాయి.

ఈ ఆలయం వద్దకు చేరడం అంత సులభమైనది కాదని కొందరి మాట. అయితే భక్తజనులు వాటినన్నిటిని అధిగమించి హృషీకేశ్ చేరుకొని ఆలయాన్ని దర్శించి భక్తితో పులకిస్తున్నారు. ఉత్తర భారత దేశయాత్రలో భాగంగా ఈ ఆలయ సందర్శన ముఖ్యమైంది మరియు పవిత్రమైనది.

ఎందరో మహానుభావుల తపస్సు ఆచరించిన పుణ్యభూమి ఇది. ప్రతిఒక్కరు తమ జీవితకాలంలో తప్పక ఈ ఆలయాన్ని సందర్శించాలి.

**హృషీకేశ్, శ్రీవేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా....**



నారాయణవనం,
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి
వారి బ్రహ్మోత్సవాలు



హృషీకేశ్,
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి
వారి బ్రహ్మోత్సవాలు



అప్పలాయిగుంట,
శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి
వారి బ్రహ్మోత్సవాలు

## 2017, జూన్ 05 నుండి 14 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 05-06-17 | సోమ | -- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 06-06-17 | మంగళ | తిరుచ్చిఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 07-06-17 | బుధ | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 08-06-17 | గురు | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 09-06-17 | శుక్ర | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 10-06-17 | శని | పల్లకిలో మోహినీఅవతారోత్సవం | గరుడవాహనం |
| 11-06-17 | ఆది | హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం | గజవాహనం |
| 12-06-17 | సోమ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 13-06-17 | మంగళ | రథోత్సవం | అశ్వవాహనం |
| 14-06-17 | బుధ | పల్లకీ ఉత్సవం, తీర్థవారి అవభృథోత్సవం, చక్రస్నానం | తిరుచ్చిలో ధ్వజావరోహణోత్సవం ద్వాదశారాధనం, ఏకాంతోత్సవం |

# శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం
## అప్పలాయగుంట

- శ్రీ పి. కృష్ణమూర్తి

మన దేవాలయాలు

అప్పలాయగుంట అనే ఈ చిన్నగ్రామం చిత్తూరు జిల్లాలోని పుత్తూరు తాలూకాలో ఉంది. ఈ గ్రామంలోనే శ్రీ ప్రసన్న వేంకటేశ్వర ఆలయం ఉంది.

**పురాణాల మాటల్లో....**

శ్రీ వేంకటేశ్వరస్వామి పద్మావతీదేవిని నారాయణ వనంలో వివాహం చేసుకున్న తర్వాత తిరుమలకు బయల్దేరా డట. అలా వెళ్తూ ఆ దారిలో ఉన్న కైలాసనాథకోనలో ఉన్న పరమశివుని దర్శించుకున్నాడట. అపుడు అక్కడ తపస్సు చేసు కుంటున్న ఋషులను అనుగ్రహించాడట. అక్కడి నుంచి యోగులకొండకు (వేములకొండ) వెళ్లారట. అక్కడున్న సిద్ధేశ్వర మహర్షి కోరిక మేరకు అక్కడే ఉండి భక్తులను ఆశీర్వదిస్తానని వరమిచ్చాడట.


ఆ మేరకు సిద్ధేశ్వరమహర్షి కొండ దిగువన స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, దానికొక ఆలయాన్ని నిర్మించాడట. ఆ స్వామికే ప్రసన్న వేంకటేశ్వరుడని నామకరణం చేశాడట. ఆ సిద్ధేశ్వరకొండలోనే ఒక గుహ ఉందట. పూర్వమెప్పుడో కార్వేటినగరరాజులు శత్రువులకు భయపడి ఆ గుహలోనే తలదాచుకున్నారట. అందువల్ల ఆ గుహకు **'దొరలు దాగిన కొండ'** అని మరోపేరు. ఆ గుహలో ఒక కత్తి ఉందనీ, దానిని ఎంత లాగినా అది బయటికి రాదనీ, గుండులో నుండి పైకి మాత్రమే వస్తుందనీ, పూర్తిగా గుండును వదలిరాదనీ స్థానికుల మాట. ఈ కత్తికే ఏటా ఉత్సవాలు కూడా జరిపించేవారట.

**అప్పలాయగుంట పేరెట్లా వచ్చిందంటే.....**

ఈ ఆలయాన్ని కార్వేటినగరరాజులు నిర్మించినట్లు శాసనాధారాలున్నాయి. వీరు ఆలయనిర్మాణంతో పాటు ఆలయం ముంగిట పెద్ద కోనేరు నిర్మాణం కూడా చేపట్టారు. ఈనాటికీ ఆ ప్రాంతంలో ఈ కోనేరే అతి పెద్దది. దీని నిర్మాణానికిగాను రోజూ వందలకొద్దీకూలీలను నియమించారు. ఆ కూలీలకు ఏ రోజుకారోజు సాయంకాలానికే అప్పుపెట్టకుండా కూలీ చెల్లించేవారట. అందుచేత ఈ గుంటకు 'అప్పలాయ గుంట' అనే పేరొచ్చింది... ఐనా కానీ ఈ కోనేటి నిర్మాణం పూర్తికాలేదట. దీని తవ్వకం పూర్తయ్యేలోపే కార్వేటి నగర రాజులు ఆర్థికంగా చితికిపోయారట. అలా అది అసంపూర్తిగా నిలిచిపోయిందట. దీనికే **'పద్మసరోవరం'** అని మరో పేరు. తిరుపతి, మద్రాసు మొదలైన ప్రాంతాలకు ఈ గుంటనుంచే తామరాకులు, పూవులు రోజూ పంపబడుతాయి.

అప్పలయ్య అనే స్థానిక అధికారి కోనేటి నిర్మాణాన్ని పర్యవేక్షించడం వల్ల ఆ కోనేటికి **'అప్పలయ్యగుంట'** అని పేరు అని మరో కథనం. స్థానిక రికార్డుల్లో **'అమృతసరోవరం'** అని ఉంది. సంస్కృతభాషలో అనృణ అంటే **'అప్పు లేనటువంటి'** అని అర్థం. ఈ కోనేటికి ముందుభాగంలో వెలసింది కాబట్టి ఈ గ్రామానికి **'అప్పలాయగుంట'** అనే పేరొచ్చింది.

**అప్పలాయగుంట, శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా....**



**ఆలయ నిర్మాణశైలి**

ఆలయం తూర్పుదిక్కుకు అభిముఖంగా నిర్మింప బడింది. ఆలయం చుట్టూ ప్రహరీ ఉంది. ఆ ప్రహరీ కూడా అసంపూర్తిగానే ఉంది. ఆలయ ప్రవేశద్వారంపైన పెద్దరాజ గోపురం నిర్మాణానికి పునాదులు వేసిన గుర్తులున్నాయి. ప్రవేశ ద్వారం దాటగానే ధ్వజస్తంభముంది. ధ్వజస్తంభానికి ముంగిట ముఖమండపం, దీనికి తూర్పుదిశలో గరుడమండపం ఉన్నాయి. ఈ మండపమందు అంజలి ఘటిస్తూ స్వామినే చూస్తున్న సుందరమైన గరుడ విగ్రహముంది.

మొదటి ప్రాకారానికి లోపలివైపున 10 అడుగల దూరంలో మరొక ప్రాకారముంది. ఈ ప్రాకారం 3 అడుగుల ఎత్తువరకు కూడా ఎదగలేదు. ఈ రెండు ప్రాకారాల మధ్య తూర్పుదిశలో పోటు ఉంది. పోటు లోపల అన్నపూర్ణ (వకుళా దేవి) శిల్పముంది. స్వామివారి ఆలయానికి ఇరువైపులా కొంచెం వెనుకగా రెండుమండపాలున్నాయి. దక్షిణంవైపు మండపం ముందు నిలువెత్తు పద్మావతిదేవి విగ్రహముంది. ఉత్తరంవైపు మండపం ముందు నిలువెత్తు ఆండాళ్ శిల్పముంది. దేవేరుల మండపాలు ఆలయానికి వెలుపలగా ఉండడం దేశంలో చాలా అరుదు. ఇదే ఈ ఆలయంలో ప్రత్యేకతగా చెప్పొచ్చు.

ఆలయం మధ్యన ప్రధానాలయముంది. ఇందులో గర్భగృహం, అంతరాళం, విశాలమైన ముఖమండపమున్నాయి. గర్భాలయమందున్న విష్ణుమూర్తి ప్రసన్న వేంకటేశ్వరుని పేర పూజలందుకొంటున్నాడు. స్వామి చతుర్భుజుడు. పై రెండు చేతులందు శంఖచక్రాలున్నాయి. క్రింద కుడిచేయి అభయ ముద్రతోను, ఎడమచేయి వరదముద్రతోను ఉన్నాయి. స్వామి వక్షఃస్థలంపై కుడివైపున త్రికోణం గుర్తు ఉంది. స్వామికి సమీపంలో ఉత్సవర్లు, సుదర్శన ఆళ్వార్ విగ్రహాలున్నాయి. గర్భాలయంపైన చతురస్రాకార ద్రావిడరీతి శిల్పకళను సూచించే విమానం, విమానంపైన కలశాలున్నాయి. విమానం నాలుగువైపులా 8 కోష్ఠాలున్నాయి. ఉత్సవాల రోజుల్లో ఈ కోష్ఠాలలో (గూళ్లు) దీపాలుంచుతారు. ముఖ్యంగా కార్తికదీపం రోజుల్లో ఈ దీపాలు వెలిగిస్తారు.

గర్భాలయం ముంగిట సన్నటి అంతరాళముంది. అంతరాళం గోడలు నునుపుగా ఉండి, అలంకరణలేవీ లేకుండా ఉంటాయి. అంతరాళానికి ముంగిట చతురస్రాకారంలో



16 స్తంభాల సాయంతో నిర్మింపబడిన ముఖమండపముంది. ఈ మండప స్తంభాలు, గోడలు కూడా ఎటువంటి శిల్పాలను కల్గియుండ లేదు. ముఖ మండపం ఉత్తరంవైపు తొమ్మిదిమంది వైష్ణవ ఆళ్వారుల శిల్పాలున్నాయి. ఈ మండపమందు దాదాపు నాలుగు అడుగుల ఎత్తున్న లోహపు దీపపు స్తంభాలున్నాయి. ఈ స్తంభాలను కార్వేటినగరరాజు శ్రీరాజ వెంకటపెరు మాళ్ దొరవారు అమృత సరోవరనగర స్వామికి బహూకరించినట్లు దీప స్తంభాలపైన లిఖించబడుంది. గర్భా లయం, అంతరాళం, ముఖమండపం ఒకే అధిష్ఠానంపై నిర్మింపబడున్నాయి.

ఆలయం ముంగిట వంద గజాల దూరంలో వేంకటేశ్వరుని చూస్తున్నట్లు ఆంజనేయమండపముంది. దీనిలో అయిదు అడుగుల ఎత్తున్న ఆంజ నేయస్వామి నిలుచుని ఉన్నాడు. స్వామి చాలా మహిమ కలవాడని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ఈ ఆంజ నేయునికి, తిరుమల కొండపైనున్న బేడిఆంజనేయునికి పోలికలు ఉన్నా యట. అర్చకులు స్వామికి నైవేద్యం సమర్పించిన వెంటనే ఆంజనేయునికి సమర్పించి, ఆ పైన బలిపీఠానికి నైవేద్యం సమర్పిస్తారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం 'శ్రవణం' కాబట్టి జ్యేష్ఠమాస మందు స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలు తొమ్మిదిరోజులు జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలకు అశేష ప్రజా నీకమూ తరలివచ్చి, బ్రహ్మోత్సవాలు తిలకించి, భగవంతుని ఆశీస్సులతో తమ జన్మను పునీతం చేసుకుంటారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

## సర్వసౌకర్యాల సమ్మేళనం - తిరుపతిలో వెలసిన

# విష్ణునివాసం

## (యాత్రికుల వసతి సముదాయం)

**శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో అత్యంత ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన యాత్రికుల వసతి సముదాయమే ఈ "విష్ణునివాసం".**

**01)** ఇది తిరుపతి రైల్వేస్టేషనుకు ఎదురుగా ఉంది.

**02)** తి.తి.దేవస్థానం వారిచే నిర్మితమైన విష్ణునివాసం 408 గదులతో తేది 21-09-2011న ప్రారంభించారు. ఈ 408 గదులు, అతిథిగృహాలు అద్దెకు ఇవ్వడానికిగాను ఈ ధరలపట్టిక ఇస్తున్నాము.

| సంఖ్య | గదుల రకాలు | గది ధర | మొత్తం గదులు |
|---|---|---|---|
| 1 | ఎ.సి.లేని గదులు | రూ.300/- | 196 |
| 2 | ఎ.సి.లేని సూట్స్ | రూ.500/- | 8 |
| 3 | ఎ.సి.గదులు | రూ.800/- | 196 |
| 4 | ఎ.సి.సూట్స్ | రూ.1,300/- | 8 |
| | | మొత్తం | 408 |

**03)** ఇందుకుగాను తి.తి.దేవస్థానం ధర్మకర్తలమండలి తీర్మానం ప్రకారం విష్ణు నివాసమునకుగాను దాతలనుండి (ఎ.సి.గదులు, ఎ.సి.లేని గదులకుగాను) కాటేజీ పథకం క్రింద దాతలనుండి ఒకొక్క గదికి రూ.10 లక్షలు తీసు కొనుటకు తీర్మానించారు.

**04)** అదేవిధంగా (ఎ.సి. మరియు ఎ.సి.లేని సూట్స్‌గదులకు గాను) దాతల వద్ద నుండి రూ.18 లక్షలను ఒక్కొక్క సూట్స్‌గదికి తి.తి.దే.కాటేజి పథకం క్రింద తీసుకొనుటకు తీర్మానించారు.

**05)** ఇందుకుగాను దాతలకు శ్రీనివాసం వసతి సముదాయంలో ఇచ్చిన విధంగా విష్ణునివాసంలో బసచేసే సౌకర్యం కల్పిస్తుంది. అలాగే, ఈ క్రింది సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయబడతాయి.

**అ)** విష్ణునివాసము, తిరుపతినందు సంవత్సరంలో 15 రోజులు బసచేయ డానికిగాను సౌకర్యం కల్పిస్తారు.

**ఆ)** తిరుమలలో సంవత్సరంలో 15 రోజులు బసచేయడానికిగాను ఈ క్రింద ఇవ్వబడిన శ్రేణుల ప్రకారం గది ఏర్పాటు చేస్తారు.

**1)** గదుల దాతలకుగాను రూ.500/- శ్రేణి గదిని ఏర్పాటు చేయబడు తుంది.

**2)** సూట్స్ దాతకుగాను రూ.1,000/- శ్రేణి గదిని ఏర్పాటు చేయబడు తుంది.

*- ఉపకార్యనిర్వహణాధికారి (విష్ణునివాసం)*





# శ్రీనివాసుడే.. కాపాడకపోయుంటే..!!

- శ్రీ ఆర్లగడ్డ శంకర్

మాది నెల్లూరు జిల్లా. నాయుడుపేట టౌన్. నేను సెకెండరీ గ్రేడు టీచర్‌గా పనిచేస్తున్నాను. మా ఉపాధ్యాయులు కొందరం కలసి శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తబృందంగా ఏర్పడ్డాం. ప్రతి శనివారం ఒక్కొక్క ఉపాధ్యాయుని ఇంట్లో సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, గోవిందనామాలు చదువుతూ భజన చేసి, శ్రీనివాసుని పాటలు పాడుతాము. తర్వాత శ్రీవారి పటానికి పూజలు చేసి వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంచుతాము.

ఇలా ఇప్పటికి 192 శనివారాలు చేశాం. ప్రతి 40 వారాలు పూర్తి అయిన తర్వాత 41వ వారం మా భక్త బృందం సభ్యులందరూ కలిసి అరవైమంది దాకా తిరుమలకు నడిచిపోయి అక్కడ శ్రీవారి భజనలు చేసి శ్రీవారి దర్శనం చేసుకొని వస్తాము. ఇలా చేయడం మాకు ఎంతో ఆనందంగా ఉంటుంది. ఇప్పటివరకు 41వ, 81వ, 121వ, 161వ వారాలలో శ్రీవారిని దర్శించుకొన్నాము.

ఒకరోజు శనివారం సాయంత్రం నేను పనిచేసే ఊర్లో జనాభాలెక్కలు వ్రాసి సాయంకాలం పూజకు వెళ్లాలని తొందరగా వస్తున్నాను. ఇంతలో హఠాత్తుగా ఉన్నట్టు ఉండి ఒక కుక్క పరిగెత్తుకుంటూ వచ్చి నా స్కూటర్ క్రిందకు దూరింది. దాంతో స్కూటర్ ఎగిరి అవతలపడింది. నేను ఎగిరి రోడ్డుపై దొర్లుకుంటూ కొంచెం దూరం వెళ్ళి పడిపోయాను. ఇంతలో ఆటోలో పోతున్నవాళ్లు సార్ పడిపోయాడు. లేపుతామని వచ్చి లేపి దెబ్బలు ఏమైనా తగిలినాయా సార్ అన్నారు. శ్రీనివాసా అంటూ లేచి చూసాను. ఒక్కదెబ్బ తగల లేదు. కనీసం ఒక్క గీత కూడా పడలేదు. అంతా శ్రీవారి మహిమ అనుకుంటూ ఇంటికి వెళ్ళి స్నానం చేసి మా బృందం చేసే పూజకు వెళ్లి పూజలో పాల్గొన్నాను. పూజ తర్వాత ఈ విషయాన్ని మా భక్త బృందం వాళ్లకి చెప్పాను. అందరూ స్వామి దయచేత నీకు చిన్నదెబ్బయినా తగల్లేదు అన్నారు.



తర్వాత కొన్నిరోజులకు మా స్నేహితుని ముఖం అంతా గాయాలతో, చేయి విరిగిపోయి కట్టుతో కనిపించాడు. ఏమైంది నీకు అని అడిగాను. నా స్కూటర్ క్రిందకు కుక్క వచ్చింది. నేను స్కూటర్ పై నుండి క్రింద పడి ఇలా జరిగింది అన్నాడు. కుక్కపడితే ఇలా అవుతుందా అనుకున్నాను. నాకు ఇలా దెబ్బలు తగలకుండా ఆ వేంకటేశ్వరస్వామివారే కాపాడారు.

కనుక స్వామివారిని భక్తితో, నమ్మకంతో ఎవరైతే నిత్యం పూజిస్తుంటారో... ఆయన మనల్ని నిత్యం ఆపదలనుండి కాపాడుతూనే ఉంటాడు అనటానికి ఇదో ఉదాహరణ.

ఓం నమో వేంకటేశాయ

# తేజోమూర్తి! మరీచి మహర్షి!!

- శ్రీ చాకిచెర్ల నాగ సుదర్శన రావు

ఈ చరాచర సృష్టికే ఆలవాలమైన ఎందరో మహా ఋషుల పాద స్పర్శతో పునీతమైంది ఈ భారతావని. బ్రహ్మ దేవుని మానసపుత్రులలో ఒకరైన మరీచిమహర్షి , దైవసంపన్నుడు, తేజోమూర్తి, ప్రాతఃస్మరణీయుడు. సాక్షాత్ నారయాణాంశగా అవతరించారు.

ఈ అనంత సృష్టి నిర్మాణంకోసం ఉదయించిన ప్రజాపతులలో మరీచి మొదటివాడు, అంతేగాదు, మొదటి మన్వంతరంలోని సప్తఋషులలో మరీచి మహర్షి ఒకరు, శ్రీవిఖనో మునీంద్రుల అంతరంగ శిష్యులలో ఒకరైన మరీచిమహర్షి వైఖానస సంప్రదాయ అభ్యుదయానికి ఎన్నో గ్రంథాలను అందించారు. వాటిలో ఆనందసంహిత ప్రధానమైనది. ఈ గ్రంథంలో అనంతరూపుడైన ఆ శ్రీమన్నారాయణుడిని గురించిన అర్చన, పూజా విధానము మొదలైన ఎన్నో వైదికవిషయాలను తెలియజేసిన ఘనత ఈ మహాఋషికే దక్కింది.




ఒకానొక సమయంలో, వేదసారం అర్థంగాక, ఏ భగవంతుని కొలవాలని, సత్వాది గుణములే లక్షణములుగా కలవాడగు, అవ్యక్తుడగు, సర్వాత్మకుడును, నిర్గుణుడును, అయన పరంధాముడెవ్వడని, శ్రుతి, స్మృతీతిహాసాదులచేత ఏకగ్రీవముగ కొనియాడబడే ఒకే ఒక దేవుడెవ్వడు, అని సంశయాత్ముకులైన సువ్రతుడు మొదలైన మునులుకు, వారి సంశయాలను తీరుస్తూ, వైఖానస ప్రాశస్త్యాన్ని ఈ విధంగా చెప్పాడు మరీచిమహర్షి-

దేవతలలో శ్రేష్ఠుడగు దేవుడు హరినారాయణ పర శబ్దములచే పిలువబడుతున్నారు, ఇందుకు శ్రుతియే ప్రమాణం, ఆ నారాయణుడు పరబ్రహ్మము ఆయనే అవ్యయుడు, అంతేగాక, దేవతలందరిలో విష్ణువే ప్రథముడు, అగ్ని కడపటి వాడు, ఈ మధ్య అధికారంలో తక్కిన దేవతలందరు ఉంటారు.

అందుకే వేదం చెపుతుంది, సర్వం విష్ణుమయం జగత్, హరిమయం ఈ విశ్వమంతా సాక్షాత్ విష్ణు దర్శనుడైన మరీచి మహర్షి ఎంతటి భాగ్యశాలో కదా!!

ఆ స్వామిని మనస్సునందు ఏ విధముగా అర్చించవలెనో వివరించాడు మహర్షి, ప్రసన్నమైన ప్రదేశంలో సంగరహితుడై, ఇంద్రియ నిగ్రహం చేసి పరమాత్మలో ధ్యానమగ్నుడై హృదయకమలంలో పుండరీకాక్షుడైన ఆ నారాయుణుణ్ణి తలుస్తూ, మనస్సులో ధ్యానం చేయాలి - దీనినే మానసికార్చన అంటారు. ఋగ్యజుస్సామ మంత్రాలచే ధ్యానించి బ్రాహ్మణులు చేసే అర్చనను వాచికార్చనమని అంటారు. అగ్నిహోత్రంలో వ్రేల్చబడు హోమ విధానమే అమూర్తమైన కాయికార్చన,

అని చెప్పవచ్చు. అంతేగాదు, కృతయుగంలో మానసికార్చనం, త్రేతాయుగంలో హోమపూజ, ద్వాపరంలో విగ్రహార్చనం, కలి యుగంలో హరినామ చింతనం తుల్య ఫలాలని చెప్పారు.

మరీచి మహర్షి వైఖానస సంప్రదాయానికి ఎంతటి ఔన్నత్యం, శక్తియున్నదో ఒక దృష్టాంతం ద్వారా తెలిపారు.

పూర్వకాలంలో చోళమండలంలోని ఒక నగరంలో ఒక వైఖానస బాలుడుండేవాడు. అతడు చిన్నతనంలో, లౌకిక ప్రసంగాలు చేసేందుకు శక్తిచాలనివాడయ్యెను. తన తండ్రి బాల్యంలోనే కాలం చేసినందున ఆతడు తన తల్లిని పోషిస్తూ ఆ నగరంలో నివసించేవాడు. ఆ సమయంలో దుష్టబుద్ధులగువారు, ధర్మద్రోహులగు దేవలకులనువారు ప్రబలి ఉన్నారు. వైఖానస సంప్రదాయంలో పారంపర్యముగా వచ్చెడి ఆ ఆలయ అధికారి తన బిడ్డని, ఆ బాలుని తల్లి చెపుతున్న మాటలను తెలుసుకుని ఆ దుర్మార్గులు ఈ పిల్లవాడు చిన్నవాడు జ్ఞానం చాలదని, శిశువీతడు అని ఆక్షేపిస్తూ వివేకశూన్యుడైన ఆ పురపాలకుడైన ప్రభువునకు తప్పుగా వివరించి ఆ ఆలయ అధికారాన్ని వారు చేజిక్కించుకున్నారు.

వీరి దుశ్చర్యను తెలుసుకొన్న ఆ నారాయణుడు మహో గ్రుడై, ఆ పురపాలకుని స్వప్నంలో కనపడి, ఓ రాజా! గర్భ గుడిలో అర్చన చేసేందుకు ఆ దేవలకులకు అధికారం లేదు, వారిని బహిష్కరించమని ఆజ్ఞాపించి అంతర్ధానుడు అవుతాడు, తెల్లవారి ఆ పురపాలకుడు ఈ వృత్తాంతమును ఆ దేవలకులకు చెప్పి అపహాస్యముచేసి, వారిచేతనే ఆలయంలో పూజచేయించ దానికి మదోన్మత్తుడై నిశ్చయించి, తను కూడ మందిరానికి వెళ్తాడు. అప్పుడు వారి అహంకారానికి కోపంతో స్వామి, వారికి శిక్ష విధిస్తాడు, వారు ఎంత ప్రయత్నించినా ఆ గుడి తలుపులు తెరుచుకోవు, అంతేకాదు, వారందరు నిస్తేజులై ఎక్కడి వారు అక్కడే చెక్క బొమ్మలవలె స్థాణువులవుతారు. ఆ దృశ్యాన్ని చూసిన ఆ పురప్రభువు భయకంపితుడై తన తప్పును తెలుసుకుని పరుగుపరుగునా ఆ వైఖానస బాలుడింటికి వెళ్ళి దగ్గరుండి, ఆ బాలుని గుడికి తీసుకొని వచ్చి, ఆ బాలునితో ఇలా అంటాడు, 'ఓ వైఖానస కులావతాంసమా! నన్ను క్షమించు! నేను అజ్ఞాన వశమున ఈ నేరం చేశాను, నీపై నాకు ఎటువంటి ద్రోహ చింతనం లేదు, నా శరీరం కంపింస్తున్నది, మా అహంకారం తొలగింది, నీవే ఈ అలయ అధికారివి, వైఖానస సంప్రదాయ మహిమను కానక చేసిన ఈ తప్పును క్షమించి, ఈ ఆలయ తలుపులు తెరవమని' చెప్పి ఆ స్వామిని శరణువేడుతాడు, ఆ పురపాలకుడు.

అప్పుడు నారాయణుడికి మదిలో నమస్కరించి, ఆ బాలుడు ఆ గుడి తలుపులు తెరువగా, అవి ఎప్పటిలా సులభంగా తెరువబడెను, అప్పుడు ఆ బాలుడు ఆలయా భ్యంతరమున ప్రవేశించి, స్వామికి నిత్యకైంకర్యాన్ని నిర్వర్తించిన వాడై, నైవేద్యం సమర్పించి, తినుమని వేడుకొనెను.

అప్పుడు ఆ పరంధాముడు, మహాలక్ష్మీసంపన్నుడు, పురుషోత్తముడు అయిన ఆ నారాయణుడు ఎంతో సంతసించిన వాడై ఇట్లు పలుకుతాడు, 'ఓ పుత్రరత్నమా! నీచే నైవేద్యాన్ని తీసుకున్నాను. సంతుష్టునయ్యాను' అని ఆ బాలుణ్ణి ఊరడించి, అక్కడి ప్రజలందరిని ఉద్దేశించి, ఇది మొదలుకొని ఎప్పుడుగాని, వైఖానసకులమందు జన్మించి వేదాధ్యయనం ఒనర్చిన వారే నా ఆరాధనమునకు అర్హులు అని చెప్పి, ఈ విషయంలో ఎవరైన అతిక్రమించితే నేనీభూలోకములో ఉండకుండా బహుదూర ప్రదేశానికి వెళ్తానని తెలిపి అందరినీ దీవించి అంతర్ధానుడవు తాడు. వైఖానసుడు వైఖానసశాస్త్ర విధానంగా విష్ణువును ఆరా ధించటమే శాస్త్రప్రమాణమై ఉందని చెప్పిన బ్రహ్మరూపి, మరీచి మహర్షి! ఎంతటి దైవసంపన్నుడో కదా!!

మరీచి మహర్షి బోధించిన వైఖానస సూత్రాలను పాటిద్దాం, ఆ శ్రీవేంకటేశ్వరుని కృపకు పాత్రులవుదాము.

## భర్తృహరి సుభాషితాలు

నీచులు విఘ్నాలు వస్తాయన్న భయంతో పనికి
పూనుకోరు. మధ్యములు పని ప్రారంభించి..
విఘ్నాలు ఎదురైతే వదిలేస్తారు.
ధీరులు ఎన్ని ఆటంకాలు కలిగినా... పూనుకొన్నపని
తుదముట్ట నెరవేరేవరకూ వదలనే వదలరు.

– డా॥ సముద్రాల లక్ష్మణయ్య

# తిరుమలనంబి జీవితం శ్రీహరి కైంకర్యం

- శ్రీ వేమరాజు అనంతపద్మనాభం



జూన్, 06 తిరుమలనంబి
వర్ష తిరునక్షత్రం సందర్భంగా...

కలియుగదైవంగా వెలసి, తిరుమలేశునిగా, శ్రీనివాసునిగా, గోవిందునిగా, శ్రీవేంకటేశ్వరస్వామిగా భక్తులను అనుగ్రహిస్తున్న ఆ దేవదేవుని సేవలో జీవించి, తరించిన భక్తాగ్రేసరులెందరో ఉన్నారు. అందరికన్నా ముందు స్వామివారి ప్రథమతీర్థకైంకర్యులుగా కీర్తి గాంచిన భక్తవరేణ్యుడు 'పెద్దతిరుమలనంబి'. వీరినే పెరియతిరుమలైనంబి అని కూడ వ్యవహరిస్తారు. శ్రీశైల శ్రీరంగాచార్యులవారు తమ శ్రీనివాసగద్యంలో తిరుమల నంబిని శ్రీశైలపూర్ణునిగా అభివర్ణించారు.

పెద్దతిరుమలనంబి యామునాచార్యులవారి శిష్యుడు. సంస్కృత, తమిళభాషలలో మహాపండితుడు. ఇంతేగాక శ్రీవైష్ణవ విశిష్టాద్వైత ప్రవక్త శ్రీమద్రామానుజాచార్యులవారికి మేనమామ. మరియు శ్రీరామానుజులవారి ఐదుగురి గురువులలో పెద్దతిరుమలనంబి కూడ ఉన్నారు. ముఖ్యంగా శ్రీరామానుజులవారికి మహిమాన్వితమైన 'ఓం నమోనారాయణాయ'-అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశించినారు.

### తిరుమల నంబి తీర్థకైంకర్యం

మొదట తిరుమలనంబి నిత్యము చాలదూరము ప్రయాణించి మట్టి కుండలో ఆకాశగంగ నుండి అభిషేకజలము తెచ్చి స్వామివారికి ప్రథమతీర్థకైంకర్యము చేసేవారు. ఆ సేవకు శ్రీనివాసుడు ఎంతో సంతోషించేవాడు. పెద్దతిరుమలనంబి కైంకర్యమును లోకానికి తెలియచేసే ఉద్దేశ్యముతో కిరాతకుని రూపంలో ధనుర్బాణములు ధరించి తిరుమలనంబితో తనకు దాహం వేస్తున్నది, కొంత జలమివ్వమని అడిగాడు. దానికి మొదటి తిరుమలనంబి నిరాకరించగా స్వామి వాని వెంటే వెళ్ళారు. అనంతరం బాణముతో కుండకు చిల్లు చేశారు. జలం త్రాగడం నంబి చూశారు. తన కైంకర్యమునకు భంగం కలిగిందని ఎంతో వ్యథచెందాడు.

కిరాతక రూపంలో ఉన్న శ్రీనివాసుడు ఇచ్చటికి దగ్గరలోనే జలమున్నదని తన బాణంతో ఒక కొండను తాకగానే విశేషమైన జలధారరావడం, ఇకముందు ఈ నీటితోనే తనకు అభిషేకము చేయమని చెప్తూతూ అంతర్ధానమయ్యాడు. ఆ కిరాతకుడే తన స్వామియని తెలుసుకొని పరవశించిపోయాడు ఆ మహాభక్తుడు నంబి.

ఆనాటి నుండి ఆకాశగంగ తీర్థముతోనే స్వామి వారి కైంకర్యము తిరుమలలో జరుగుతున్నది. ఆ రోజును 'ఆకాశగంగా తీర్థోత్సవ తన్నీరముదు ఉత్సవం, అమృత జలోత్సవం' అనే పేర్లతో ప్రతీ సంవత్సరం వైకుంఠఏకాదశికి 11 రోజులు ముందుగా ప్రారంభమై, వైకుంఠ ఏకాదశి తర్వాత 14 రోజులు - మొత్తం 25 రోజులు జరుగుతుంది. ఈ సమయంలో శ్రీవారి అధ్యయనోత్సవం, తిరుమలనంబి తిరుమంజనం నిర్వహిస్తారు. సాక్షాత్తు శ్రీనివాసునిచే 'తాత' అని పిలువబడిన తిరుమలనంబి ధన్యుడు.




## తిరుమల నంబి ఇతర కైంకర్యాలు

పెద్దతిరుమలనంబి స్వామివారికి అనేక కైంకర్యాలు చేసేవారు. వాటిలో ముఖ్యమైనవి తోమాలసేవ, తిరుమంజన కైంకర్యం, ఆకాశగంగ తీర్థకైంకర్యము, శాతుమురై, మంత్రపుష్పకైంకర్యం, వేదపారాయణం మొదలైనవి. నేటికీ ఈ కైంకర్య ములు తిరుమలనంబి వంశీయులు నిత్యమూ స్వామివారికి భక్తి ప్రపత్తులతో చేస్తూనే ఉన్నారు.

చారిత్రకాధారముల వలన పెద్దతిరుమలనంబి తిరుమల దక్షిణమాడవీథిలో నివసించి నిత్యం కైంకర్యములు చేసే వారని తెలియుచున్నది. నేటికీ స్వామివారి నిత్య ఊరేగింపు దక్షిణవీథిలోని పెద్దతిరుమలనంబి ఆలయం వద్ద ప్రథమహారతిని అందుకొని ప్రారంభమౌతుంది.

## శ్రీరామానుజులవారికి రామాయణబోధ

స్వామి ఆళ్వాందారువారు తమ సనాతన ధర్మజ్ఞాన సంపదను శిష్యసమేతంగా శ్రీరామానుజులకు ప్రసాదించారు. శ్రీరామాయణమును మాత్రం పెద్దతిరుమలనంబి వారికి ప్రసాదించారు. కాలాంతరమున శ్రీరామానుజులకు పెద్దతిరుమలనంబి రామాయణ రహస్యములను తెలిపిన సంఘటన ఎంతో మహత్తరం మహిమాన్వితం.

పెద్దతిరుమలనంబి ఆదేశానుసారము శ్రీరామానుజులు తిరుమలకు వచ్చి మూడురోజులు స్వామివారిని సేవించి తిరుపతిలోని అలిపిరి సమీపంలో నివసించారు. ప్రతినిత్యమూ శ్రీవేంకటేశుని ప్రభాత కైంకర్యములు చేసి నంబి తిరుమలనుండి క్రిందికి దిగి వచ్చి శ్రీరామానుజులవారికి శ్రీరామాయణమును సంవత్సరంపాటు బోధించారు. చెప్పిన అర్థం తిరిగి చెప్పకుండా 18 మార్లు రామాయణ రహస్యాలు వివరించారు. ఆ సమయంలో మధ్యాహ్న సమయంలో శ్రీనివాసునికి కైంకర్యము చేయలేకపోతున్నం దుకు చింతిస్తున్న నంబికి ప్రత్యక్షమై తన పాదాలను అలిపిరి వద్ద ప్రసాదించి సేవించ మని అనుగ్రహించారు. అవే భక్తులు అలిపిరి వద్ద కొలిచే శ్రీవారి పాదములు.

ఇన్ని విశేషములతో తన యావజ్జీవితము శ్రీనివాసుని సేవలో తరించిన పెద్దతిరుమలనంబి స్వామివారి ప్రథమ కైంకర్యములు చేసిన భక్తవరేణ్యుడు. అన్నమా చార్యుల వారు 'కొండలలో నెలకొన్న కోనేటి రాయడువాడు' అనే కీర్తనలో 'మచ్చిక దొలక తిరుమలనంబి తోడుత నిచ్చ నిచ్చ మాటలాడి వచ్చినవాడు' అని ప్రస్తావించాడు.

ఈనాటికీ వేలాదిమంది భక్తులు తిరుమలకొండలు కాలినడకన ఎక్కి మొక్కులు తీర్చుకోవడం-అలిపిరి వద్ద శ్రీనివాసుని పాదాలకు నిత్యహారతులు ఇవ్వడం, గోవింద నామస్మరణతో తిరుమల మారుమ్రోగడం-నిత్యసత్య వైభవాలుగా భాసిస్తున్నాయి.

చిరస్మరణీయుడు, ప్రాతఃస్మరణీయునిగా పెద్దతిరుమలనంబి శ్రీవేంకటేశుని భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలచి ఉన్నాడు.



2017 - మే 4, 5, 6 తేదీలలో తిరుమలలో జరిగిన
శ్రీపద్మావతీ-శ్రీనివాసుల పరిణయమహోత్సవ చిత్రమాలిక

వరాలతల్లికి
వసంతాల వేడుక












తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి
వసంతోత్సవ దృశ్యాలు

అందరికీ శ్రీహరే
అంతరాత్మ











శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి 609వ జయంతి ఉత్సవాలు



## తిరుచానూరు
## శ్రీ పద్మావతీఅమ్మవారి
## తెప్పోత్సవాలు

05-06-2017 నుండి
09-06-2017 వరకు



## శ్రీనివాసమంగాపురం
## శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి
## సాక్షాత్కార వైభవోత్సవం

28-06-2017 నుండి
30-06-2017 వరకు



తిరుపతి

# శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం

**2017 మే 31 నుండి జూన్ 08 వరకు**

**31-05-2017 బుధవారం**

పగలు: ధ్వజారోహణం - రాత్రి: పెద్దశేషవాహనం.

**01-06-2017 గురువారం**

పగలు: చిన్నశేషవాహనం - రాత్రి: హంసవాహనం.

**02-06-2017 శుక్రవారం**

పగలు: సింహవాహనం - రాత్రి: ముత్యపుపందిరివాహనం.

**03-06-2017 శనివారం**

పగలు: కల్పవృక్షవాహనం - రాత్రి: సర్వభూపాలవాహనం.

**04-06-2017 ఆదివారం**

పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం - రాత్రి: గరుడవాహనం.

**05-06-2017 సోమవారం**

పగలు: హనుమద్వాహనం - రాత్రి: గజవాహనం.

**06-06-2017 మంగళవారం**

పగలు: సూర్యప్రభవాహనం - రాత్రి: చంద్రప్రభవాహనం.

**07-06-2017 బుధవారం**

పగలు: రథోత్సవం - రాత్రి: అశ్వవాహనం.

**08-06-2017 గురువారం**

పగలు: చక్రస్నానం - రాత్రి: ధ్వజావరోహణం.

# శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి సాక్షాత్కార వైభవోత్సవం, శ్రీనివాసమంగాపురం

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

**శ్రీనివాసుడు తిరుమలకొండమీదే కాక, కొండ క్రిందకూడా సాక్షాత్కరించాడంట!**
**వందేండ్లకిందటి నుంచి వినపడుతున్న మాట ఇది!**
**నాకు తెలిసిన ఆసక్తికరమైన ఈ వింత గాథను మీముందు ఉంచుతున్నా, మీరూ ఆనందించండి....**

తిరుపతికి సరిగ్గా పశ్చిమాన పట్టుమని పది మైళ్లదూరంలో ఉన్న ఒక పల్లెటూరు. ఆ ఊరుబయట, మొండి గోపురంతో, గోడలతో ఉసూరుమంటున్న శిథిల మైన ఆలయం.


"మా తాత ముత్తాతలనుండే అంటే వందల ఏండ్లనుండే ఆ గుడి అలాగే ఉందనీ, పాడుబడిన ఆ గుళ్లో పూర్వం వేంకటేశ్వరస్వామి విగ్రహం ఉండేదనీ, కాని ఇప్పుడా విగ్రహం ఉందో, లేదో, కనీసం ఏ దేవుడి విగ్రహం అయినా ఉందో కూడ తెలియదనీ" ఆ ఊరి జనం అంటున్న మాట!

ఆ గుడి చుట్టూవున్న గోడలరాళ్లు కాళ్లువచ్చి కదలిపోయినా, గోపురశిఖరం, బలిపీఠం ధ్వజస్తంభం వానలకు నానుతూ, ఎండలకు ఎండుతూ శిథిలమై నిస్త్రాణంగా ఉంటూ మనసును మెలిపెట్టి పిండుతాయి. అయినా ఆ ప్రాంగణం నడుమభాగన శిలావేదికపై నిర్మింపబడ్డ ప్రధానమైన గుడి, గోడల శిలలు బీటలు వారినా, కొంచం ఎగుడుదిగుళ్లైనా వింత వెలుగులీనుతూ అందంగానే కనపడుతుంది.

వాకిళ్లే లేని ఆ గుడిమండపంలోనికి వెళ్లాలనీ, లోన గర్భగుళ్లో ఏ ముందో చూడాలన్న తపన ఆసక్తీ ఉన్నా, అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లూ ఎత్తైనపుట్టలూ నాగ జెముడుచెట్లు, తీగలూ, విచ్చలవిడిగా తిరుగాడుతున్న పెద్దపెద్ద పాములూ, తేళ్లూ గబ్బిలాలు. వీటిని చూస్తే చాలు, ఎవరికీ గుండెధైర్యం చాలేదికాదు. కాని, ఆ శిథి లాలయం ఆరుబయట్లో పగటిపూట మాత్రం పసువులు, మేకలు వాటిని కాచే పసులకాపరులు సేదదీరేవారు.

ఇదీ వందలఏండ్లుగా సాగుతున్న ఆ శిథిలాలయ చరిత్ర!

విచిత్రాతి విచిత్రం! క్రీ.శ.1900 ప్రాంతాన ఒక వెర్రిబాగుల లాంటి అమాయక స్త్రీ, ఆకాశం నుంచి ఊడిపడ్డట్టుగా ఆ గుడి ఆవరణలో ప్రత్యక్షమయ్యింది. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు.



శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి,
శ్రీ నివాస మంగాపురం
(1970)

ఏ ఊరో తెలియదు. ఏం పేరో ఎవరికీ తెలియదు. అడిగినా చెబితే కదా తెలిసేది. అన్నింటికీ వెర్రిచూపులతో కూడిన చిరునవ్వే ఆమె సమాధానం.

నిమ్మపండులాంటి పసుపుపచ్చని శరీరఛాయ, నుదుటన పెద్దకుంకుమబొట్టు, నిండుగా కట్టుకున్న ముతకచీర, చేతులనిండా ఆకుపచ్చని మట్టిగాజులు. సగం నెరసిన పెద్ద కొప్పు. చెరగని చిరునవ్వుతో ఏభైఏండ్లు దాటిన యోగిని లాంటి స్త్రీ. పేరే చెప్పని ఆ తల్లికి "తాయారమ్మ" అని ఆ ఊరి వాళ్లే పేరుపెట్టుకొని పిలిచేవారు. ఆమె కూడ "ఆ" అని బదులు పలికేది.

ఆ రోజు నుండి ఆ గుడి ప్రాంగణంలోని ఆకులు, అలములు చెత్త చెదారం తీసి వేసి శుభ్రం చేసేది. ఊళ్లోకి వెళ్లి ఇల్లిల్లు తిరిగి బిచ్చం అడిగేది. గుళ్ళో "శ్రీనివాసుడు" ఉన్నాడు. నన్ను పూజ చెయ్యమన్నాడు. ఏదైనా ఇవ్వండి అంటూ నవ్వుతూ అడిగేది, తాయారమ్మ.

కాసులిస్తే వద్దనేది. కొంచెం చమురో, కాసిన్ని బియ్యమో, పప్పో, ఉప్పో పెట్టమని అడిగేది. ఇచ్చిన వాటిని ఆనందంగా తీసుకొని ఆ గుడి ముంగిట్లో మూడురాళ్ల పొయ్యి మీద కుండల్లో ఉడికేసేది. అక్కడ వున్న పసులకాపర్లతో కాసిన్ని పాలు అడిగి తీసుకొనేది.

ఆమె ఒక్కతే ఒంటరిగా గుళ్లో అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లను తీసివేసి, చెత్తను ఊడ్చుకుంటూ కారు చీకటిగా ఉన్న గర్భాలయంలోనికి వెళ్ళేది. తాటి మట్టల్ని ముట్టించి ఆ వెలుతుర్లో లోపలికి పరికించి చూచింది.

దారిలో బుసలు కొట్టే నాగుల్ని చూస్తూ **"ఒరే! నాగా! స్వామికి ఆకలిగా ఉందంట! తప్పుకొండర్రా!"** అని మందలించినట్లుగా గొణిగేది. అంతే! ఆ పాములు పడగలు దించి ఒదిగి ఒదిగి దూరంగా పోయ్యేవి. కొన్ని సార్లు ఇవి మీ కోసమర్రా అంటూ పసులకాపర్లు ఇచ్చిన పాలను వాటికి పెట్టేది. లోపల గర్భగుళ్లో నిలువెత్తు శ్రీవేంకటేశ్వరుని విగ్రహం! చూచింది. పరమానందంతో పరవశించి రెండు చేతులెత్తి దండంపెట్టి సంబరపడింది. శ్రీనివాసా! గోవిందా! అంటూ ఆ నిలువెత్తు స్వామిని చేతికి అందినంతవరకు నీళ్లతో అభిషేకించేది. చమురు దీపం వెలిగించి, తాను ఉడికేసింది నివేదించేది. దానిలో కొంత పసులకాపర్లకు పంచి, మిగిలింది ప్రసాదంగా తాను ఆరగించేది.

ఇదీ ఆనాటినుంచి తాయారమ్మ నిత్యకృత్యం. సుమారు నలభై ఏండ్ల పాటు ఆయమ్మకు ఆ గుడితో, ఆ ఊరితో విడదీయలేని, విడదీయగరాని అనుబంధం ఏర్పడింది.

ఉన్నట్టుండి ఒకరోజు తాయారమ్మ ఇంటింటికి వెళ్లింది!! రేపట్నుంచి రాను, ఒక స్వామి ఎక్కణ్ణుంచో వస్తాడంట! ఆయన శ్రీనివాసుణ్ణి మంత్రాలతో పూజిస్తాడంట! ఇప్పటినుంచి ఈ గుడి వైభవంగా వెలిగిపోతుందంట! **ఇవన్నీ "వెంకటేశ్వరుడే" నాకు చెప్పి, నన్ను తుంబురుతీర్థం వెళ్లి తపస్సు చేసుకొమ్మన్నాడు. అందుకే రేపట్నుంచి నేను రాను"** – అంటూ కనపడిన వాళ్లకందరికీ చెప్పింది. పసులకాపర్లతో చెప్పింది. గుడి ఆవరణలోని పూలచెట్లను, తీగలను స్పృశిస్తూ చెప్పింది.

ఇది రోజూ ఉండే సణుగుడేలే! అని అందరూ పెద్దగా పట్టించుకోలేదు. కాని, నిజంగా ఆ మరునాడు నలభైఏండ్ల అనుబంధం ఉన్న తాయారమ్మ కనపణ్ణే లేదు. ఆమె కోసం ఆ ఊరూ, గుడీ, గోపురం మూగగా రోదించాయి.

విచిత్రంగా ఆ మరునాటి సాయంత్రమే కంచి క్షేత్రం నుండి ఒక అర్చకస్వామి వచ్చాడు. ఆ గుళ్ళోని **"శ్రీనివాస**



**ఈ క్షేత్రం నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలతో అలరారుతూ ఉంది. వివాహం కావలసినవారు, ఇక్కడ జరిగే నిత్యకల్యాణంలో పాల్గొని శ్రీస్వామివారి కల్యాణకంకణాన్ని ధరిస్తే, తప్పక త్వరలో వివాహం అవుతుందని ప్రసిద్ధి ఉంది.**

**స్వామి"** తనను అర్చించడానికి రమ్మన్నాడని ఆ ఊళ్ళో అందరికీ చెప్పాడు.

ఆ ఊరివాళ్ళు ఆశ్చర్యపోతూ, వివరంగా చెప్పండని అడిగారు.

కంచిలో ఉంటాను. నా పేరు సుందరరాజస్వామి. మా తండ్రి రాఘవేంద్రాచార్యులు. ప్రతిరోజు రాత్రనక, పగలనక స్వప్నంలో శ్రీనివాసుడు కనపడి, "రా నన్నుద్ధరించు, చీకట్లో ఉన్నాను. పుట్టల్లో చెట్లల్లో ఉన్నాను. వెంటనే వచ్చి పూజించు మన్నాడు. "స్వామీ! ఏ ఊళ్లో వున్నావు చెప్పు. అంటే పలకడు. అందువల్లే నేను తిరుపతియాత్రకు బయలు దేరి కనపడిన ఊరూ, పేటా, కోటా వెదుక్కుంటూ, ఎక్కడైనా శిథిలమైన వేంక టేశ్వరుని ఆలయం కనపడుతుందేమోనని చూస్తూ వస్తున్నాను. ఈనాటి నిద్రలో "ఇదేనయ్యా! నేనుండే ఊరు. ఇదే ఈ గుళ్లోనే వందల ఏండ్లనుంచి ఉన్నాను. నన్ను ఉద్ధరించి, శాస్త్రోక్తంగా పూజించు" అని గోవిందుడు ఆదేశించాడు అని ఈ విషయాన్ని అర్చకులు సుందరరాజ స్వామి, ఆ గ్రామంలోని ప్రతివాళ్లకు చెప్పాడు.

ఆ పల్లెజనం **"తాయారమ్మ"** చెప్పినమాట గుర్తు చేసుకొని పరమానంద పడ్డారు. సరేనంటూ ఊరు ఊరంతా కదలివచ్చారు. గుడి ఆవరణలోని చెట్లను, పుట్టలను తీసివేశారు. తీగల్ని తీసివేశారు. ఆల యాన్నంతా వందలకొద్దీ బిందెల నీళ్లతో మంద పాన్ని, గర్భాలయాన్ని కడిగి శుభ్రం చేశారు. గుడి ప్రాంగణంలో ఆవుపేడతో కల్లాపుచల్లి చక్కగా ముగ్గులు తీర్చారు. పచ్చని అరటిస్తంభాలు, మామి డాకు తోరణాలు అలం కరించారు.

ఒక్క గుడిలో మాత్రమేకాదు. ఆ ఊళ్లోని ప్రతిఇల్లూ మామిడాకులతో అలంకరించుకొన్నారు. ఊరు ఊరంతా వైభవంగా ఉత్సవ వాతావరణం నెలకొంది.

**సరిగ్గా అది 1940వ సంవత్సరం. విక్రమనామ సంవత్సరం ఆషాఢమాసం శుద్ధసప్తమీ గురువారం ఉత్తర ఫల్గుణీ నక్షత్రం కూడిన మంచిరోజు.**

అర్చకులు శ్రీసుందరరాజస్వామికి కలలో సాక్షాత్కరించి నిర్ణయించి చెప్పినట్లుగా ఆనాడు **"శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి సాక్షాత్కార వైభవోత్సవం"** పేరుతో ఘనంగా వేడుక జరుపుకున్నారు.

మళ్లీ వందల ఏండ్ల తర్వాత శాస్త్రోక్తంగా అర్చకులైన శ్రీసుందరరాజస్వామి వారి చేతులమీదుగా శ్రీనివాసమంగాపురం లోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి తొలిపూజ జరిగిన రోజున, ఆలయంలో లఘువుగా సంప్రోక్షణ చేశారు. పిదప **శ్రీవారి గర్భాలయం ముంగిట సుప్రభాతం పఠిస్తూ వందల సంవత్సరాలపాటు యోగసమాధిలో ఉన్న శ్రీస్వామివారిని మేల్కొలిపారు.** ఆ తర్వాత పురుషసూక్త శ్రీసూక్త భూనీళాసూక్తుల పఠనంతో శ్రీకల్యాణ వేంకటేశ్వరుని మూలమూర్తికి ఆవుపాలు,



పెరుగు, పసుపు, చందనం, కొబ్బరి నీరు మున్నగు అభిషేక ద్రవ్యాలతో మంగళప్రదంగా అభిషేకం నిర్వహింపబడింది.

పిదప సన్నని బంగారు జరీ అంచు ఉన్న తెల్లని పంచె, ఉత్తరీయాన్ని అలంకరించారు. నుదుట తెల్లని పచ్చ కర్పూరనామాలు తీర్చిదిద్దారు.

వివిధ రకాల పూలమాలలతో శ్రీస్వామివారి నిలువెత్తు మూర్తిని అందంగా మనోహరంగా అలంకరించారు. ఆ తర్వాత సహస్ర నామార్చన ధూపదీప నైవేద్య కర్పూర హారతులు ఘనంగా జరిగాయి.

> **జూన్ 28, 29, 30 తేదీల్లో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి సాక్షాత్కార వైభవోత్సవాలు జరుగుతాయి.**

**తొలిసారిగా... 1940, జూలై 11వ తేదీ విక్రమనామ సంవత్సరం ఆషాఢ శుద్ధసప్తమీ గురువారం నాడు జరిగిన శ్రీనివామంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవ వేడుకలు జరిగాయి.**

**ఆ వేడుకల్లో ఆ గ్రామ ప్రజలే కాక, తిరుపతి, పెరుమాళ్లపల్లె, పేరూరు, తొండవాడ, చంద్రగిరి, నరసింగాపురం, మిట్టపాళెం...... మున్నగు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. అందరి ఇండ్లలోను పండుగలు చేసుకొన్నారు.**

ఆనాటినుండి ఈ ఆలయం దినదినప్రవర్ధమానమవుతూ 1967 ఏప్రిల్ 26వ తేదీన తిరుమల తిరుపతి ఆలయాల ఆధ్వర్యంలోనికి చేరిన **ఈ ఆలయంలో 1980 జూలై నుండి మూడురోజులపాటు శ్రీకల్యాణవేంకటేశ్వరుని సాక్షాత్కార వైభవోత్సవాలు జరుగుతున్నాయి.**

ఆకాశరాజు పుత్రిక పద్మావతిని వివాహమాడిన శ్రీనివాసుడు ఈ ప్రాంతంలో ఉన్న అగస్త్యమహర్షిని దర్శించాడట. ఆ కల్యాణ దంపతులు అగస్త్యుని కోరికపై ఆరునెలలు ఇక్కడ ఉన్నందువల్ల శ్రీస్వామివారు ఇక్కడ **"శ్రీకల్యాణవేంకటేశ్వరుని"**గా పేరుపొందినాడు.

పూర్వం ఎందరో సిద్ధులు ఉన్నందువల్ల **'సిద్ధకూటం' 'సిద్ధకుట్టి'** అనీ, శ్రీనివాసుడు ఉన్నందువల్ల **"శ్రీనివాసపురం"** అనీ **"శ్రీనివాసమంగాపురం"** అనీ **"కల్యాణమంగాపురం"** అని ఈ గ్రామానికి ఎన్నో పేర్లు ఏర్పడ్డాయి.

అయితే ఈ క్షేత్రం ఎప్పుడు ప్రతిష్ఠింపబడిందో తెలియదుకాని 1433 నాటికే ఉచ్ఛస్థితిలో ఉన్న ఈ ఆలయమూ, గ్రామమూ స్వర్ణముఖి, కల్యాణీ, భీమా నదుల ఉద్ధృతమైన వరదల తాకిడికిలోనయ్యాయి.

ఆ తర్వాత 1540లో అచ్యుతరాయలు ఈ గ్రామాన్ని తాళ్లపాకవారికి మాన్యంగా ఇచ్చాడు. అప్పట్లో తాళ్లపాక అన్నమయ్య మనుమడు చిన్నన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరుని ఆలయాన్ని ఉద్ధరించాడు. అందువల్లే ఆలయ ప్రవేశద్వారంలో ఇరువైపులా అన్నమయ్య, పెదతిరుమలయ్యల శిల్పాలు దర్శనమిస్తాయి.

ఆ తర్వాత కూడ మరోమారు వరదల తాకిడికిలోనై కాలానికి ఎదురొడ్డి నిలిచిన ఈ శిథిల ఆలయంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరుని విగ్రహంమాత్రం చెక్కు చెదరలేదు.

మళ్లీ వందలఏండ్లు నిర్మానుష్యమై, నిశ్శబ్దగంభీరంగా నిలిచివున్న శ్రీకల్యాణ శ్రీనివాసుని ఆలయం, అజ్ఞాతయోగిని తాయారమ్మ, ఆ తర్వాత అర్చకులు సుందరరాజస్వామి, ఆ తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో దినదినం నవనవోన్మేషంగా అభివృద్ధి చెందింది, చెందుతూనే ఉంది.

అగస్త్యాది ఎందరో మహర్షుల తపోభూమిగా, జగత్కల్యాణ దంపతులు శ్రీపద్మావతీ శ్రీనివాసులు నడయాడిన దివ్యస్థలంగా, కల్యాణ పరంపరలను గుప్పించే ఆధ్యాత్మిక క్షేత్రంగా అలరారుతూ ఉన్న **శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం** తిరుమలకు నడిచివెళ్ళే **"శ్రీవారి మెట్టు"** మార్గంలో ఉంది.

**ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుందాం.**
**సర్వశుభాలను పొందుదాం.**



అపకారికి కూడా ఉపకారం చేయాలి

# దేహం-దేవాలయం

**- శ్రీ మంత్రవాది మహేశ్వర్**


కోపం, నిరాశ, అసూయాద్వేషాలు, స్వార్థం.... ఇలా చెప్పుకుంటూపోతే మనసును కకావికలం చేసే వ్యతిరేక భావాలెన్నో. ఒక ఆశ ఉంటే నిరాశా తప్పదు. అనుకూల భావనకు ప్రతికూల భావన ఎప్పుడూ ఉంటుంది. వ్యతిరేక భావనల్లోంచి బయటపడాలంటే మనిషి అనుకూల భావాల సంఖ్యను అంతకంతకూ పెంచుకోవాలి. ఇది మనిషి జీవితంలో నిరంతరం కొనసాగే ప్రక్రియ. ఎప్పుడూ సదాలోచనలతో ఉంటేనే ఆరోగ్యంగా ఉన్నట్లు అని చెప్పలేం. జీవితమన్నాక నిరాశమిళితమైన సందర్భాలను దాటక తప్పదు. అటువంటి భారమైన ఆలోచనల వల్ల మనసుతో బాటు శరీరం బరువెక్కుతుంది. పరిపక్వతకు చేరని భావాలు, భయం నిండిన ఆలోచనలు అంతర్గతంగా ఏర్పడతాయి. వ్యక్తం చేయనివి, అణుచుకోకబడినవి లోలోపల వేధిస్తునే ఉంటాయి. గుండె నిండా కోపం, విషపూరితమైన ఆలోచనలుండి పైకి కనబడే పెదవులపైన నవ్వులు పూయించవచ్చు. అయితే, స్వచ్ఛత కరవైనప్పుడు శరీరంలో ఓ బండరాయిని నిలుపుకొన్నట్లే. ఈ బండరాళ్లు పెరిగి పెరిగి అనేక అనారోగ్యాలకు కారణమౌతాయి.

పుట్టకురుపు వ్యాధికి, భావాలకు అణుచుకోవడానికి దగ్గర సంబంధం ఉందంటారు. ఈ వ్యాధితో బాధపడే చాలామందికి లోపల ఎంతో కోపాన్ని, ద్వేషాన్ని దాచుకున్నవారు, ఇతరుల పట్ల వ్యతిరేకత కలిగినవారు సహనంలేని వారుగా కనబడతారు. మనుషులే కాదు గతంలో జరిగిన సంఘటనలూ కారణం కావచ్చు. ఎక్కువకాలం ద్వేషాన్ని లోలోపల అణుచుకున్నవారిలో ఈ రుగ్మత బయటపడడం మొదలవుతుందంటారు. సమాజంలో బతకడంకోసం అన్ని రకాల ముసుగుల్నీ ధరించడం జరుగుతోంది. మన అసలు స్వరూపం కనబడనివ్వనంత తీరికలేకుండా బతికేస్తున్నాం. వ్యక్తం కాని వ్యతిరేక భావం ఏదో ఒక రోజున ఏదో ఒక శరీర అవయవం ద్వారా బాధతో బయటకు రాక తప్పదు.

జీవితంలో లేనిది తెచ్చిపెట్టుకుని, ఉన్నది దాచిపెట్టుకుని జీవించే దుస్థితి నుంచి బయటపడాలి. బయటొకటి, లోపల ఒకటి.. చెప్పేదొకటి, చేసేది మరొకటి. దీని కారణంగా విషం అంతకంతకూ పేరుకుపోతోంది. ఆహారపుటలవాట్ల విషయంలో శ్రద్ధ సరే. కానీ, ఇది కేవలం ఆహారానికి సంబంధించినది కాదు. ఆలోచనలతో రూపుదిద్దుకునేదన్న సత్యాన్ని మరుస్తున్నాం.

కోపం కలిగితే తప్పుకాదు. ఒంటరిగా ఉండాలనిపిస్తే ఉండొచ్చు. అయితే, కోపం కలిగిన పరిస్థితుల్లో బలవంతంగా నవ్వును తెచ్చిపెట్టుకోవడం అంటే సామరస్యాన్ని కోల్పోయినట్లే. ఆలోచనలకు శరీరానికి గల సంబంధం సామరస్యంతో కొనసాగాలి. శ్రావ్యత గోచరించాలి. అందుకే నిజంగా నవ్వాల్సి వచ్చినప్పుడు నవ్వలేకపోవడం జరుగుతోంది... వ్యవస్థ భిన్నంగా శిక్షణ పొందడం జరుగుతోంది. అందుకే ఈ విచిత్ర పరిస్థితి. ప్రేమ, నవ్వులాంటి సహజఆరోగ్యలక్షణాలు సహజంగా రాకుండా పోతున్నాయి. అంతా కృత్రిమత్వం చోటు చేసుకుంటోంది. స్వేచ్ఛగా ఉండగలినప్పుడు ఆరోగ్యంగా జీవించడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఆ కానుక మనకు మనమే సమర్పించుకోవాలి.

పిల్లలకు భావప్రకటనా స్వేచ్ఛను కల్పిస్తూ తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల బాధ్యత అపారం. పిల్లలు ఎంతో సహజంగా ఉంటారు. స్వచ్ఛంగా ఉంటారు. ఆ గొప్పలక్షణాలను కలుషితం చేయకూడదు. పిల్లలకు సంతోషం కలిగినా, కోపం వచ్చినా వారిలో ప్రతికోణంలో అది వ్యక్తమౌతుంది. లోలోపల నుంచి మనస్ఫూర్తిగా స్వచ్ఛంగా బయటికొస్తుంది. రోజంతా ఆడినా అలసటనేదే కనబడకుండా ఉత్సాహంగా కనిపించడం చూస్తే ముచ్చటేస్తుంది. అది పెద్దవాళ్లు నేర్చుకోవలసిన పాఠం. అలుపూ ఆయాసం, విసుగూ చిరాకు, విచారం పిల్లల్లో కనిపించవు. నిష్కల్మషంగా ఉండగలరు. అందుకే 'దేహాన్ని భగవంతుడుండే ఓ దేవాలయంగా' భావించాలి. ఎప్పటికప్పుడు అవ్యక్త భావాల మలినాలను శుభ్రపరచుకోవాలి. జిడ్డులా



పట్టుక్కూర్చునే మనస్తత్త్వాన్ని విడిచిపెట్టినప్పుడు ఆరోగ్య విషయంలో అద్భుతమైన మార్పులను గమనిస్తాం. సంతోషంగా జీవించేవారి దరికి ఏ రోగాలు చేరవు. గతం తాలూకు చేదు సంఘటనల విషయంలో తప్పొప్పులను పక్కన పెట్టి క్షమించాలనే నిర్ణయం తీసుకుంటేనే మనసు తేలికపడుతుంది.

ఆధ్యాత్మిక సాధన ఒక్కటే భావోద్వేగాల విషయంలో పరిపక్వతను సాధించి వ్యతిరేకభావాలను పెరిగిపోకుండా చూస్తుంది.

రోగాలను నయం చేసేందుకు వైద్యులఅవసరం ఉండచ్చు. కానీ, అంతకంటే ముందు జీవితంపట్ల మన దృక్పథం ముఖ్యమని గ్రహించాలి.

14

# కైంకర్యమే.. తనువు దాల్చితే....

- డా॥ కంపల్లె రవిచంద్రన్



(నమ్మాళ్వారు వృత్తాంతానికి ఉపక్రమణిక ఈ సంచికలో చదువవచ్చు)


నమ్మాళ్వారు అవయవి, ఇతరాళ్వారులు అవయవ భూతులు. నమ్మాళ్వారు అవయవాలతో కూడిన శరీరం.

చోళదేశానికి దక్షిణాన ఉండే పాండ్యదేశంలో మాహాత్మ్యం, అనుష్ఠానం, ఆరోగ్యం, స్వచ్ఛత కలిగి సారతరమైన తామ్రపర్ణి నదీ తీరంలో కురుగై, లేక కురుకా (ఆళ్వారు తిరునగరి) అనే పేర్లు కలిగిన ప్రసిద్ధపట్టణం ఉంది. ఒక్కొక్క ప్రదేశానికి ఒక్కొక్కరి వల్ల గౌరవం కల్గుతుంది. నమ్మాళ్వార్ల అవతరణ వల్ల కురకా పట్టణం లోకమాన్యమైంది.

ఆ పట్టణాన్ని తిరువరుదివళనాడన్ (శ్రీమద్విభూతి నాథుడు) అనే రాజు పరిపాలిస్తూ ఉన్నాడు. ఈ రాజుకు ప్రపితా మహుడైన, కురుకుడు పాలించినందువల్ల ఈ ఊరికి 'కురుకా' అనే పేరు కల్గింది. ఈ రాజు రాజ్యమేలేటప్పుడు దుంధుమారుడనే రాక్షసుడు ఋషులను బాధించేవాడు. ఆ ఋషులందరూ రాజు దగ్గరకు కెళ్లి "ఓ రాజా! ఆ రాక్షసుని బాధ పడలేక మేమందరం బ్రహ్మ దగ్గరకెళ్లి కాపాడమని వేడుకున్నాం. అందుకు బ్రహ్మదేవుడు, "ఋషులారా! ఆ రాక్షసుడు వరబలసంపన్నుడు. భగవంతుడు ఒక మానవుడికి. పుత్రుడై జన్మించి, భగవంతునిఅవతారమైన తనకే మళ్లీ పుత్రుడై పుట్టినట్లయితే అతనిచేత వీనికి మరణం కలుగుతుం దని అతను వరం పొంది ఉన్నాడు. అందుచేత మేమందరమూ స్వామితో చెప్పుకున్నాము. మీరు కూడా కురకాపట్టణానికి వెళ్లి, ఆ పట్టణ రాజుకు తిరుప్పావును ఉపదేశించండి." అని చెప్పాడు. ఋషులు బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారం ఆ రాజు దగ్గరకు వచ్చి విషయం చెప్పారు.

రాజు, వారు చెప్పింది విని "ఋషులారా! తిరుప్పావు అంత మహిమ కలిగిందా? రాజ్యభోగాలు, సిరిసంపదలు, ప్రసాది స్తుందా?" అని అడగగా, అగస్త్యుడు తిరుప్పావు మహిమ చెప్పడం ప్రారంభించాడు. "రాజా! మహీసారక్షేత్రంలో, సంహనమనే పట్టణముంది. దాన్ని మతి, క్రోధుడు, చిత్తుడు అనే మంత్రులతో గూడి క్షేత్రవిదుడనే రాజు పాలించేవాడు. అంటే శరీరమనే క్షేత్రంలో క్షేత్రవిదుడనే ఆత్మ ఉన్నదని అర్థం. ఆ రాజుకు సంకల్పుడనే వాడు దూత. వాడు చాలా అయోగ్యమైన పనులు జరిపించేవాడు. మతి అనే మంత్రి రాజు సమీపంలో ఉండేంతవరకూ సంకల్పుని ఆటలు సాగేవి కావు. ఇలా ఉండగా, మతి కొన్ని రోజులు ఏవో కార్యాం తరాల వల్ల సెలవు తీసుకున్నాడు. సంకల్పుడు ఇదే అనువైన సమయమని తెలుసుకుని రాజు దగ్గరకు వెళ్లి, "రాజా! అధ్యాత్మతత్త్వ కూటమి అనే అడవిలో అరిషడ్వర్గాలనే వారి మధ్య రుచి అనే స్త్రీ ఉంది. మీరు గనుక వచ్చినట్లయితే అక్కడికి పిలుచుకునిపోతాను." అని పిలువగా, రాజు, అతడితో పాటు వెళ్లి ఆ స్త్రీని స్వీకరించి ఆమెతో సుఖభోగాలను అనుభవించసాగాడు.

ఒకరోజు దుర్వ్యాధులను, క్రూరజంతువులు తరుము కోగా, రాజు పరుగెత్తాడు. రుచి కూడా "నన్ను విడవద్దు" అని వెళ్లి రాజు మెడను పట్టుకుంది. రాజు చేసేది లేక ఆమెను విడువలేక ఆమెతో పాటు పరుగెత్తి, సంసారమనే పాడు బావిలో పడ్డాడు. గృహం అంధకూపం. దానిలో పడితే గత్యంతరం లేదని ప్రహ్లాదుడు భాగవతంలో చెప్పాడు. క్షేత్రవిదుడు ఇలాంటి కూపంలో ఏలపడాలి అంటే, నాలుగువైపులా కసవు మొలచి కొంచెం సుఖాన్ని చూపి స్తుంటే మోసపోయిపడ్డాడు. ఆ గడ్డిలో మొలచి ఉన్న ఒక తీగను పట్టుకొని వ్రేలాడుతుంటే, కామక్రోధాదులనే ఆరుముఖాలు, కర్మేం ద్రియ, జ్ఞానేంద్రియ, మనోబుద్ధులనే పన్నెండు కాళ్లను కలిగిన అడవిఏనుగు వచ్చి, ఆ చెట్టును ఆడించింది. రాగద్వేషాలనే రెండు



ఎలుకలు ఆ తీగను కొరికగా, అది తెగి రాజు బావిలో పడ్డాడు. క్షేత్రవిదుడు ఆ ఆపద సమయంలో తన మంత్రి అయిన మతిని తలచుకోగా, అతడు వచ్చి మెల్లగా రాజునెత్తి – "సంకల్పుని వల్ల కదా ఇలాంటి ఆపద సంభవించింది. ఇక రుచిని వదిలేసి తిరుపతికి పోయి తిరుప్పావు ఉపదేశాన్ని పొంది సుఖపడండి" అని చెప్పాడు. ఆరోజు అలాగే చేసి సుఖపడ్డాడు. తిరుప్పావు ఉపదేశం పొందితే అజ్ఞానం నశించి జ్ఞానం కలుగుతుంది. మతి కలుగు తుంది. భగవద్దర్శనమౌతుంది. పెద్దల దగ్గర ఉపదేశం జరుగు తుంది". అని అగస్త్యుడు తిరువరుది వళనాడరుకు చెప్పగా అతడు చాలా ఆశ్చర్యపడ్డాడు. అంతేకాదు తిరుప్పావు ప్రభావం ఇంకా తెలుసుకోవాలని కుతూహలపడి అదే విషయం అగస్త్యునితో అన్నాడు.

అగస్త్యుడు చెప్పడం ప్రారంభించాడు. ఉత్తరప్రదేశంలో శంకరమనే పట్టణాన్ని ఉగ్రాస్యుడనే పరమశైవరాజు పరిపాలిస్తుండే వాడు. అతని మంత్రి పుండరీకుడు పరమవైష్ణవుడు. ఆ మంత్రి విష్ణుప్రభావాన్ని కొంచెం కొంచెంగా ఆ రాజుకు చెప్పడం ప్రారం భించాడు. దానికి ప్రభావితుడైన రాజు నంబెరు మాళ్ల (శ్రీరంగ నాథుని) సన్నిధికి పోయి అక్కడ విప్రనారాయణుని దగ్గర తిరుప్పావు ఉపదేశం పొందాడు. ఆ రాజుకు ఎన్నేండ్లైనా సంతానం కలగక పోవడంతో శివుని సన్నిధికి వెళ్లి, "నాకు సంతతి కలుగలేదు. నీ కృప కలుగని నాకు నా శరీరమేల? దీనిని నీకే ఇచ్చేస్తాను". అని శిరస్సు నరుక్కుపోవడానికి ఉపక్రమించగా – శివుడు "ఓరీ! నీవు అపచారం చేశావు కాబట్టి తిరుప్పావును అనుష్ఠించు" అని చెప్పాడు. ఉగ్రాస్యుడు శివాజ్ఞను పాటించగా అతనికి శంకరదత్తుడనే పుత్రుడు ఉదయించాడు.

ఆ శంకరదత్తుడు శైవమతస్థాపనాచార్యుడై దేశ సంచారం చేస్తూ వైకుంఠం అనే ఊరు చేరాడు. అక్కడ గోవిందు డనే యాద వుణ్ణి సంధించి అతని చేతిలో ఓడిపోయి తన రాజ్యాన్ని అతనికి ఇచ్చేశాడు. తర్వాత తిరుపతికి వచ్చి పాండవ తీర్థంలో స్నాన మాచరించి, తిరుప్పావు ఉపదేశం పొంది, తిరు వేంగడ దాసుడనే పేరుతో ఉండేవాడు. స్వామి గోవిందునికి కలలో ప్రత్యక్షమై రాజ్యాన్ని తిరువేంగడదాసునికి ఇమ్మని చెప్పాడు. అతడు వచ్చి స్వామి ఆజ్ఞను తెలిపి రాజ్యం ఇచ్చి వెళ్లాడు. ఈ విధంగా ఉగ్రాస్యుని కొడుకు తిరిగి సుఖసంపదలు పొందాడు. కాబట్టి, ఓ రాజా! నీవు సక్రమంగా తిరుప్పావును అనుష్ఠింపుము. స్వామి తప్పక అవతరిస్తాడు. దాంతో దుంధుమారుని వల్ల బాధ తొలగి, మాకు మంచి జరుగుతుంది" అని అగస్త్యుడు ఋషులతో కలసి చెప్పి, తిరుప్పావును ఉపదేశించి అనుగ్రహించాడు.

*(ఇంకా ఉంది)*

బాలప్రబోధం

# అంబరీషుడు

- శ్రీ ఎన్.మునిరామయ్య

అంబరీషుడు సూర్యవంశంలో జన్మించాడు. ఆడి తప్పని వాడుగా ధర్మాన్ని తు.చ. తప్పక పాటించే వాడుగా ప్రసిద్ధి పొందాడు.

ప్రజలందరికీ విష్ణుభక్తిని బోధిస్తుండేవాడు. ద్వాదశీ మహావ్రతాన్ని నియమం తప్పక పాటించేవాడు. అంబరీషుడు ప్రజలందరి చేత కూడా ఆ వ్రతాన్ని చేయిస్తూ వారిని కన్నబిడ్డల వలే చూస్తుండేవాడు.

ఒకనాడు అంబరీషుడు ద్వాదశీవ్రతాన్ని ప్రారంభించాడు. బ్రాహ్మణశ్రేష్ఠులను ఆహ్వానించాడు. ప్రజలు కూడ రాజ్యమంతటా ఆ వ్రతాన్ని చేస్తున్నారు. భక్తులతో బాటు రాజు కూడా ఉపవాసం ఉండి యజ్ఞం చేశాడు. మధ్యాహ్నం సమీపించబోతుంది. పలురకాల పిండివంటలు చేయించింది మహారాణి. అతిథులకు, భర్తకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్నది. ఆ సమయానికి దుర్వాసమహర్షి వచ్చాడు.

అంబరీషుడు ఆ మహర్షిని సాదరముగా ఆహ్వానించాడు. ఆతిథ్యం స్వీకరించమని ప్రార్థించాడు. దుర్వాస మహాముని స్నానాదుల నిర్వహించుటకు వెళ్లాడు. నదికి వెళ్లిన దుర్వాసుడు ప్రొద్దుపోతున్ననూ తిరిగి రాలేదు. భక్తులు, మునులు, ఆకలితో అలమటించుట అంబరీషుడు గమనించారు. పాపం, తనకు పరీక్షా సమయంగా భావించాడు. అతిథులను గౌరవించకపోయినా ద్వాదశీవ్రతం వ్యర్థమౌతుంది. దుర్వాసముని రాకనే భోజనాలు ప్రారంభించడం సమంజసంగా కనిపించలేదు.

అంబరీషుడు మంత్రుల ద్వారా ఈ సమస్యను పరిష్కరించగోరగా అందున ఒక మంత్రి అంబరీషుని ఉద్దేశించి-

"మహారాజా మీకు తెలియని ధర్మములు ఏమియు లేవు. దుర్వాసముని వచ్చు వరకు మీరు మేము భోజనములు చేయక వేచి ఉండెదము. మిగిలిన అతిథులను ఆకలిబాధకు గురిచేయుట భావ్యం కాదని" చెప్పెను. ఆ మాటలు సమంజసంగా తోచెను.

అతిథులకు భోజనము వడ్డించమని అంబరీషుడు అజ్ఞాపించాడు. అందులో ఒక అతిథి 'మీరు భోజనము చేయక మేము భుజించుట ధర్మసమ్మతము' కాదని చెప్పగా అంబరీషుడు వారి మాటలును కాదన లేక ఉదకమును సేవించి అతిథులను భోజనము చేయమని ప్రార్థించాడు.

దుర్వాసుడు స్నానాలు ముగించుకొని అంబరీషుదుని వద్దకు వచ్చాడు. తను వచ్చు వరకు ఆగక అతిథులకు ఆతిథ్యం ఇచ్చినందులకు దుర్వాసుడు మిక్కిలి కోపంతో "ఓ అంబరీషా!! నా మాటలను ధిక్కరించి అవమానించావు. కావున, ఫలితం అనుభవిస్తావు" చూడు అన్నాడు.

అంబరీషుడు వినయం, విధేయతలతో దుర్వాసునికి నమస్కరిస్తూ "మునీంద్రా! అతిథులను వేళ దాటిన తర్వాత అతిథ్యమిచ్చుట భావ్యం కాదని నేను కొంచెము ఉదకమును సేవించి, ఆతిథ్యమునకు అనుమతిచ్చి మీ కోసం ఎదురు చూస్తున్నాను" అని ఎంతో నమ్రతతో వేడుకొనగా దుర్వాసుడు మండిపడుతూ, 'నన్ను గౌరవించుటకంటే వ్రత నియమము గొప్పదా! అని అందునా నీ వంటి దోషి జీవించి ఉండకూడదని, కమండలం నుంచి మంత్రజలం తీసి అంబరీషునిపై చల్లాడు.

ఈ హఠాత్ సంఘటనకు అక్కడి వారందరూ భయభ్రాంతులైనారు. అప్పుడు భక్తితో అంబరీషుడు విష్ణునామస్మరణ చేశాడు. దుర్వాసుని మంత్రజలము నుండి 'కృత్యా' అను రక్కసి ఆవిర్భవించింది. అంబరీషుని మ్రింగుటకు ముందుకు ఉరికింది. అదే సమయంలో దివ్యకిరణాలు వెదజల్లుచూ చక్రాయుధం అంబరీషుడు నుండి వెలువడింది. వెనువెంటనే ఆ రక్కసి శిరస్సును ఖండించింది. ఆ వెంటనే దుర్వాసుని వెంబడించింది. దుర్వాసుడు భయంతో అక్కడి నుండి పారిపోవడం ప్రారంభించాడు. విష్ణుచక్రం దుర్వాసుని వదలలేదు.

దుర్వాసుడు మొట్టమొదట అష్టదిక్పాలకులతో పరివేష్టితుడైన ఇంద్రుని శరణుజొచ్చాడు.

'మునీంద్రా! నీకు వచ్చిన ఆపదేమిటి? ఎవరైనా రాక్షసులు నిన్ను హింసించుచున్నారా!' అని అడుగగా, 'మహేంద్రా!




అంబరీషుని శపించినందులకు, విష్ణుచక్రము నన్ను వెంటాడుచున్నది. నన్ను కాపాడు మహేంద్ర' అని వేడుకొనగా వెంటనే చక్రాయుధం ప్రత్యక్షమైంది. ఇంద్రుడు తత్తరపాటుతో మహేశ్వరుని శరణు వేడమన్నాడు. అక్కడ నుండి దుర్వాసుడు మహేశ్వరుని చేరి ఆయనను శరణు వేడాడు.

మహేశ్వరుడు పరిస్థితిని తెలుసుకొని సత్యలోకమునకు వెళ్లి బ్రహ్మను శరణు వేడుమని సలహా ఇచ్చాడు. బ్రహ్మ వద్దకు వెళ్లగా బ్రహ్మ తానేమి చేయజాలనని, అది సాధ్యం కాని పని అని చెప్పాడు. అప్పటి కప్పుడు దుర్వాసుడు సత్యలోకము నుండి పారిపోయాడు. దుర్వాసుడు విష్ణువును శరణు వేడాడు. 'దుర్వాసా! అంబరీషుడు మహా భక్తుడని తెలిసి కూడా నీ అహంకారంతో భక్తులను హింసించడం ప్రారంభించావు. నీ దుష్కార్య ఫలితము అనుభవించక తప్పదు' అన్నాడు.

దుర్వాసుడు పశ్చాత్తాప హృదయుడై దుఃఖిస్తూ "ఇంకెప్పుడూ భక్తుల జోలికిపోను. ఆ చక్రాయుధాన్ని ఉపసంహరించు మహాప్రభు" అని విష్ణువును మనసావాచా ప్రార్థించాడు. అప్పుడు మహావిష్ణువు అంబరీషుని శరణు వేడమన్నాడు. దుర్వాసుడు అంబరీషుని పాదాలపై వ్రాలాడు.

అంతట అంబరీషుడు ఆ మహాయుధానికి నమస్కరిస్తూ దుర్వాసముని అపరాధమును మన్నించమని ప్రార్థించాడు. ఆ మహనీయుని ప్రార్థనను మన్నించి చక్రాయుధం అదృశ్యమైంది. అనంతరం దుర్వాసుడు అంబరీషుని దీవించి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. భక్తి చాల గొప్పదని అందులోనూ వినయ విధేయతలతో కూడిన వ్యక్తులను, భక్తులను శిక్షించబూనాడు. వారి పతనానికి నాంది పలుకుతుందనడానికి దుర్వాస మహామునిదే చక్కని ఉదాహరణ.

# మహాభారతానుశీలనమ్

రచయిత - పుత్తా పుల్లారెడ్డి, పుటలు - 308, సైజు -1/8 డెమ్మిసైజు, వెల-రూ.200/-
ప్రతులకు - పుత్తా పుల్లారెడ్డి, ఇ.నెం. సి-01-265, మారుతీనగర్, కడప-516 001.
ఫోన్ - 08562-247116. సెల్ - 99592 41001

మన సాహిత్యంలోనే మహాభారతం విస్తృతమైనది. ఇందులో ప్రధానకథాఘట్టాలూ, ఉపాఖ్యానాలూ మిళితమై ఉన్నాయి. అందువల్ల ఈ గ్రంథాన్ని చదివే పాఠకులకు ఎన్నెన్నో సందేహాలు వస్తాయి. వాటిని తీర్చుకోవాలనే తపన అందరికీ ఉంటుంది. అయితే తీర్చేవారు అనుకున్నపుడు దొరకరు. ఆ లోటును తీర్చటానికి పుత్తాపుల్లారెడ్డి **'మహాభారతాను - శీలనమ్'** అనే గ్రంథాన్ని వెలువరించి పాఠకులకు మహోప కారం చేశారు.

ఇందులో ఈయన సంస్కృతాంధ్ర మహాభారతము లను క్షుణ్ణంగా పరిశీలించి తనకు కలిగిన సందేహాలలో తొంభై తొమ్మిదింటిని గ్రంథస్థం చేశారు. ఈ క్రమంలో ఆంధ్ర భాగవతము, హరివంశము, మార్కండేయపురాణం, వాల్మీకి రామాయణముతో బాటు కొన్ని తెలుగు రామాయణములు, దేవీభాగవతములను కూడా పరిశీలించారు. తనకు కలిగిన సందేహాలను మూడురకాలుగా వర్గీకరించి వివరించారు. కొన్ని సందేహాలకు సమాధానాలను సోపపత్తికంగా నిర్ణయించారు. కొన్ని సందేహాలకు సమాధానాలను ఊహించి చెప్పారు. కొన్ని సందేహాలకు సమాధానాలను ఊహించుకోమని పాఠకు లకే వదిలిపెట్టాడు. వీరి సందేహాలు కొన్ని ఇలా ఉన్నాయి. భీష్ముడు ద్రుపదునికి విరోధియా? అర్జునుని ఒంటి రంగు ఏది? మాంసాహారులకు స్వర్గప్రవేశం లేదా? వంటివి ఉన్నాయి. ఇలాంటి సందేహాలెన్నో పాఠకులకు కూడా వస్తాయి. వాటిని నివృత్తి చేసుకొనుమార్గం లేక అలాగే ఉండిపోతారు. అయితే పుల్లారెడ్డి వాటికి సమాధానాలు పరిశోధనాదృష్టితో కనిపెట్టారు. విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులు చేయాల్సిన కృషిని వీరు చేసి పాఠకులకు మహోపకారం చేశారు. ఈ గ్రంథరచనలో పుల్లారెడ్డి విశేషంగా శ్రమించారు. సత్కీర్తి ద్వారా శ్రమకు తగ్గ ఫలితాన్ని పొందారు. ప్రాచీన సాహిత్యాభిమానుల మదిలో నిలిచి పోయారు. సాహిత్యఉపన్యాసకులు, బోధకులు, ఆధ్యాత్మిక వేత్తలు, సాహితీపిపాసులు తప్పక చదువదగ్గ గ్రంథరాజం ఇది.

*- కె.ఆర్.శ్వేత*

## గ్రంథసమీక్ష

# మార్కండేయపురాణ నామ సర్వస్వము (రఘునాథీయము)

రచయిత - పుత్తా పుల్లారెడ్డి, పుటలు - 516, సైజు-1/8 డెమ్మిసైజు,
వెల - రూ.300/-, ప్రతులకు - పుత్తా పుల్లారెడ్డి,
ఇ.నెం. సి-01-265, మారుతీనగర్, కడప-516 001.
ఫోన్ - 08562-247116. సెల్ - 99592 41001

ప్రాచీన తెలుగుసాహిత్యంలో మారన మార్కండేయ పురాణానికి ఒక ప్రత్యేకస్థానం ఉంది. పుల్లారెడ్డి మారన మార్కం డేయపురాణ నామకోశాన్ని రూపొందించారు. నామకోశ నిర్మాణంలో వారిది ఒక ప్రత్యేక ధోరణి. ఏదైనా ఒక నామం తానెన్నుకున్న గ్రంథంలో ప్రస్తావనకు వస్తే అదే నామం భారత భాగవత రామాయణాదులలో ఏయే స్వరూపాలతో ఉన్నదో ఆధారాలతో సహా చూపించారు. దీనివలన పాఠకులకు, పౌరా ణిక విజ్ఞాన పునాదులు బాగా తెలుస్తాయి.

వీరు పేర్లను అకారాది క్రమంలో ఎన్నుకున్నారు. ఎన్నుకున్న పదానికి పూర్తి వివరణ ఇచ్చారు. పేరు నామవాచక మైతే ఆ పేరు గల వ్యక్తి స్వరూప స్వభావాలు, కుటుంబం, సాధించిన విజయాలు వంటి వాటిని సోదాహరణంగా వివరిం చారు. అంతేగాకుండా ఆ పదం ఏ పద్యంలో ఉందో కూడా సూచించారు. ఇలా చేయటానికి ఒక గ్రంథంలోనే పరిజ్ఞానం ఉంటే సరిపోదు. మొత్తం అలాంటి సాహిత్యంపై పట్టు ఉంటే తప్ప అది సాధ్యం కాదు. వృత్తిరీత్యా ఇంజినీరు అయిన రెడ్డిగారు ప్రాచీన సాహిత్యంపై ఇంత పట్టు సాధించారంటే వారి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలను కొనియాడక తప్పదు.

ఈ గ్రంథంలో వీరు 1737 నామములకు వివరణలు ఇచ్చారు. ప్రతి పేరు వీరి కృషిని తెలియజేస్తున్నది.

సాధారణంగా ఒక నిఘంటువు ఒక పదానికి అర్థాన్ని మాత్రమే ఇస్తుంది. అదే నామకోశం- ఆ పదం పూర్వాపరాలను విశదంగా తెలుపుతుంది. పాఠకునికి పదానికి అర్థంకంటే నామకోశ వివరణే కావాల్సి ఉంటుంది. దీని ద్వారా పాఠకులు ఒక రచన పట్ల పరిపూర్ణజ్ఞానాన్ని పొందగలుగుతారు. ఈ తరహా కృషి చేసిన పుల్లారెడ్డి అభినందనీయులు.

ఇది ప్రతి సాహితీవేత్త ఇంట ఉండదగ్గ మంచిగ్రంథం. ఇది తప్పకుండా సాహిత్యాభిమానుల ఆదరణ పొందుతుందని చెప్పవచ్చు.

*- డి.మల్లీశ్వరి*

# భాగవతం - ముక్తిదాయకం



– డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్

వేద సారస్వతసారాన్నే శ్రీమద్రామాయణ భారత భాగవతాలు కథాత్మకంగా కమనీయంగా అందించాయి. ఆరద్య మానవసౌశీల్యాన్ని, సనాతనధార్మిక సంప్రదాయ వైభవాన్ని, ఆలుమగల అద్వైత అనుబంధాన్ని, సాధుసహనశీల సాక్షాత్కారాన్ని హృద్యంగా, అనవద్యంగా, వేద్యంగా రామాయణం ఆవిష్కరించింది. భారతీయ ధర్మసంస్కృతిని, సమష్టి కుటుంబ జీవనరీతిని, అనుభూతిని, నైతిక జీవనవిధిని, మానవ మనుగడ పరమార్థాన్ని వివేచనతో వివరంగా వివరించిన సాహిత్యం మహాభారతం కాగా ఆస్తికత్వం, అవతారతత్త్వం, ఆధ్యాత్మికతా నిత్యత్వం, భక్తిమార్గం, 'భగవంతుడు–భాగవతుడు' వీరి మధ్యగల సంబంధ బాంధవ్యాలను మృదుమధురంగా, మహిమోన్నతంగా మనస్సులకు ఎక్కే రీతిలో మేథస్సునకు చిక్కే సాత్త్వికతతో ప్రవచించింది మహాభాగవతం.

మహాభాగవతం ఒక మహాపురాణం. "పురాణం సర్వ శాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాస్మృతమ్." సర్వశాస్త్రాలలో పురాణం మొదటిది. అది బ్రహ్మచే చెప్పబడింది. అనంతరమే చతుర్ముఖ బ్రహ్మ ముఖాలనుండి వేదాలు వెలువడినాయని వాయుపురాణం సెలవిస్తోంది."పురా నవం భవతి పురాణమ్" ప్రాచీనమైనప్పటికీ నూతనంగా కన్పించడం చేతనే పురాణ మైనదని విజ్ఞుల నిర్వచనం. పరబ్రహ్మ పదార్థ విజ్ఞానం సనాతనమే అయిననూ నిత్య నూతనమే కదా! పరతత్త్వాన్ని ప్రవచించి, ప్రబోధించిన మహాభాగవతం పురాణమై అచ్యుతుని అవతార విశేషాలను, ఆత్మపరమాత్మను చేరుకొనే దారులను, తీరులను సరసంగా, మట్టసంగా, మాత్సర్య రహితంగా ప్రబోధించడం విశేషం. ముక్తికి మూలమైన భాగవతం తెలియచెప్పడం శూలికి (శివునకు) తమ్మిచూలికీ (బ్రహ్మకు) సాధ్యం కాదు. అయినను "విబుధుల వలన విన్నంత కన్నంత తెలయవచ్చినంత చెప్తున్నా"నని భక్త పోతన సవినయంగా వివరించాడు. పోతన కవి స్వయంగా భక్తుడు. "భక్త్యా భాగవతం జ్ఞేయమ్" భక్తితోనే భాగవతం తెలియవస్తుంది. కనుకనే జనవశీకరణాద్భుతశక్తి యుక్తమై భాగవత దీప్తి విశ్వశ్రేయమై వెల్గొందుతోంది. త్యాగయ్య, క్షేత్రయ్య అన్నమయ్యాది వాగ్గేయకారులు పోతన భాగవతాన్ని నిత్యపారాయణ గ్రంథంగా చేసుకొని భక్తకోటికి భక్తిరస స్ఫూర్తిని అందించారు.

భగవంతునకు సంబంధించినది భాగవతం. నిరంతరం భగవద్రతితో పరవశించే మహాసుకృతి భాగవతుడు. జీవుని దేవుని దరిచేర్చేది భక్తి. భక్తికి మూలం దివ్యానురక్తి. మాయామేయ జగత్తు యొక్క నిజతత్త్వాన్ని స్వానుభవంలో ఋజువు చేసుకొని, సత్యం శివం సుందరమైన పరమాత్మ ధామమే నిత్యం పథ్యం మహద్భాగ్యం అని ఎఱిగి, మదిలోని కోర్కెలను, మాలిన్యాలను, దురంత చింతలను, ఛిద్రాలను దూరీకరించి అనఘుడైన అచ్యుతుని సాన్నిహిత్య సారూప్య సాయుజ్యాలకై పరితపించి, ప్రణుతులను ప్రణామాలను అర్పించడమే దివ్యానురక్తి. ఈ దివ్యానురక్తిలో జీవుడు దేవునితో స్వస్వరూపానుసంధానం కావిస్తాడు. అదే భక్తి. భగవంతునిపై ప్రేమాతిశయంతో చేసే ఒక పావన ప్రక్రియ. ఆత్మపరమాత్మతో విడదీయరానంతగా కలసిపోవడం నది సముద్రుణ్ణి తన నామ రూపరుచులను వదలి ఒక్కటై కలసిపోయినట్లు, దేహి తన చిత్తవృత్తులను ప్రవృత్తులను నిరోధించి, చక్రి (విష్ణువు) పాదారవింద ధ్యానంలో నిమగ్నుకావడం నిజమైన భక్తి. నిజానికి జీవుడు దేవుడువే అన్న భ్రాంతిలో బ్రతకడం విద్దూరం. జీవేశ్వరులు అద్వైత భావాన్ని పొంది, ఒక్కటైనామన్న జ్ఞానాన్ని కూడా కోల్పోవడమే నిజమైన భక్తి. విష్ణుభక్తి యుక్తులే భాగవతులు.

కనుక, భగవంతుడు భాగవతుల మధ్యగల బాంధవ్యాన్ని, ఇష్టంగా స్పష్టంగా సరళంగా సుందరంగా అందించినది భాగవతం. ఈ భాగవతాన్ని ఆదిలో ఆదినారాయణమూర్తి బ్రహ్మకు వివరించాడు. బ్రహ్మ తన మానసపుత్రుడు నారదునకు తెల్పాడు. నారదుడు వ్యాసభగవానులకు, వ్యాసులవారు శ్రీశుకుల వారికిని, శ్రీశుకులవారు పరీక్షన్మహారాజునకు వర్ణించి చెప్పినట్లుగా తెలుస్తోంది. భక్తివేదాంతాలు, జ్ఞానవైరాగ్యాల అవసరాలను అనుగ్రహించగల్గినది ఈ భాగవతం.

భగవానుడు సిద్ధ పురుషుడై జ్ఞానమార్గాన్ని, మహర్షియై కర్మమార్గాన్ని, యోగియై యోగమార్గాన్ని, ప్రజాపతియై సృష్టి కార్యాన్ని, రాజునై దుష్టసంహారాన్ని చేస్తాడు. చివరకు కాల రూపంలో సర్వం సంహారం చేస్తున్నాడు. అక్కడితో ఆగక అనేక అవతారాలను ధరించి జగద్ధితాన్ని, సాధుజనసంరక్షణను, దుష్ట శిక్షణను నెరవేర్చుతున్నాడు. భాగవతంలో స్వామి ఏకవింశతి అనగా ఇరవై యొక్క అవతారాలు ధరించినట్లు తెలుస్తోంది. అలాగే నవవిధ భక్తిమార్గాలను తెలియచెప్పి, భాగవతులు తనను చేరే సులభమైన భక్తి బాటలను చూపడం విశేషం. ఇవే కాకుండా మధురభక్తి, వాత్సల్యభక్తి, వైరభక్తి విధానాలను కూడా మనం గమనింపవచ్చు. ఒక ఊరికి దారులనేకాలు. అలాగే ఆత్మ తన స్వస్థానమైన పరమాత్మను చేరడానికిని అనేకానేక మార్గాలు. ఎవరిష్టమైన త్రోవలో వారు చిత్తశుద్ధితో, భక్తి నిబద్ధతో, పరిణతినందిన బుద్ధితో పయనించి పరంధాముని చేరవచ్చు. ఈ సత్యాన్ని ఆమోదయోగ్యంగా, అనుభవైకవేద్యంగా, భాగవతం అందిస్తోంది.

"ఎఱుగని వానికిం దెలియనీశ్వరులీల లెఱుంగఁ జెప్పలే" అని నారదుడు వేదపదార్థజాత, బ్రహ్మవిద్యానిర్ణేత, యోగినేత అయిన వ్యాసునికి సెలవిచ్చాడు. ఫలితంగా అందివచ్చిందే భాగవతం. వేద ఇతిహాసాలసారమై, సంసారపారావారాన్ని దాటించే భక్తినావల వైభవాన్ని అందించిన ఈ భాగవతంసంస్కృతంలో వ్యాసభగవానులు రచించగా, తెలుగులో పోతనకవి "జననంబు సఫలంబు చేసెద పునర్జన్మంబు లేకుండగన్" అంటూ జన్మరాహిత్యానికి, జన్మసాఫల్యానికిని ఈ వ్యాస భాగవతాన్ని తెనిగించడం గమనార్హం.

జీవేశ్వరులను ఏకం చేయజాలిన భక్తి భావన ఒక మహనీయ బ్రహ్మోత్సవం. పరబ్రహ్మ సాక్షాత్కారానందం అనిర్వచనీయమే గదా! భాగవత కథాశ్రవణం లేదా భగవానుని మహిమా సంకీర్తనం లేదా భగవంతుని నామస్మరణం, లేదా పాదసేవ లేదా పూజించడం లేదా మ్రొక్కులు చెల్లించడం లేదా దాస్యం చేయడం లేదా చెలిమి చేయడం లేదా పరాత్పరునికి తనను తాను అర్పించుకోవడం లేదా భగవంతుణ్ణి నాయకునిగా, భక్తుడు తనను నాయికగా చేసుకొని మధురభక్తిని ప్రకటించడం లేదా భగవానుని బిడ్డగ భావించి వాత్సల్యామృతాన్ని పంచడం లేదా పరమాత్మను ద్వేషించి (శాపం / పాపం / కోపం మొదలగు వాని వలన) నిరంతరం స్వామిని తలచి, తలచి, తల్లడిల్లి, దైవంతో పోరాటం చేసి, ఆ దైవం వలననే పరమపదాన్ని చేరడం ఒక్కటేమిటి? భక్తి మార్గాలనేకాలు. అన్నింటికి సంబంధించిన భక్తులచరిత్రలు, భగవానుని లీలావిలాసాలు, మాయలు మహిమలతో నిండిన భాగవత పఠనం పారాయణం నిజమైన భక్తునకు ఋజులైన బ్రహ్మోత్సవ వైభవమే కదా! అయితే విశ్వాసం ముఖ్యం. విశ్వేశునిపై విశ్వాసం ఉంటేనే జీవికి బ్రతుకు భద్రం. లేదా బ్రతుకు ఛిద్రమే. చీకాకే. ఈ నిజాన్ని గమనించాలి.

**బాంధవముననైనఁ బగనైన, వగనైన**
**బ్రీతినైన బ్రాణభీతినైన**
**భక్తినైన హరికిఁ బరతంత్రులైయుండు**
**జనులు మోక్షమునకు జనుదు రధిప**

**(భాగవతం - దశమస్కంధం)**

అని శ్రీశుకులవారు పరీక్షిత్తునకు తెల్పడం జరిగింది. విష్ణుపరతంత్రులై భక్తి నావలో బ్రతుకు పయనం సాగిస్తే ముక్తిని పొందుతారన్న సత్యాన్ని స్పష్టం చేశారు. "నన్ను కీర్తించి సేవించే నా భక్తులకు నేనే పరమగతిని. నా భక్తుని వెంటనే నేను సదా ఉంటాను." అని సాక్షాత్తు విష్ణుమూర్తి దూర్వాసునకు సెలవివ్వడం కూడా ఆలోచనీయం. అయితే, ఈ భాగవతులెవ్వరు? దీన్ని కూడా భాగవతం సెలవిచ్చింది. "భగవానుని ప్రవచనాలతో ప్రొద్దులు కరగించేవారు; పరమయోగిమునిజనులకు సదానంద భాగ్యోదయాన్ని కల్గించేవారు, చక్రి పదారవింద ధ్యానామృత పానమగ్నులు, పాపాటవులను గాల్చి, ప్రసన్నమనస్కులై భగవద్రతిలో పరవశించేవారు, భక్తి భావతత్త్వార్థ వేదులు,

బ్రహ్మజ్ఞానవిదులు, ఆధ్యాత్మిక భావనా వైభవంతో అలరువారు భాగవతులు. ఇలాంటి భాగవతులైన విష్ణుభక్తులందరికి మీరు చేరరాదు" అని యమధర్మరాజు తన దూతలకు చెప్పి, చివరకు

**పద్మనయను మీది భక్తియోగం బెల్ల**
**ముక్తి యోగమనుచు మొదలెఱుంగు**
**వారి వారి వారి వారిఁ జేరినవారి**
**త్రోవబోవ లీలదు దూతలార!**

అంటూ 'విష్ణుభక్తి యోగమే ముక్తియోగం. కనుక విష్ణు భక్తులు మరియు వారితో చేరియున్నవారి జోలికి మీరుపోరాదు' అని కూడా ధర్మరాజు భటులను ఆదేశించడం గమనార్హం. భక్తి బలం ఫలం అమోఘం. అనిర్వచనీయం. అందుకే "హరి భక్తులతో సంభాషణ అమోఘమైన పుణ్యపు మూటలు. ముక్తి కాంతా ప్రసాదాలు. కామక్రోధాది అరిషడ్వర్గం ప్రవేశింపరాని దుర్గాలు." అని తీర్పు చెప్పడంలో గల మర్మం గుర్తించాలి.

కనుక దేహి దైవాన్ని నిత్యం దర్శించాలి, స్పృశించాలి, సేవించాలి, సంభాషించాలి, సాష్టాంగ పడాలి, సమాధాన పడాలి, తన వేదనను, రోదనను, వాదనను, ఆర్తిని ఆర్ద్రతను స్వామి ముందుంచాలి. సాయంకోరాలి. అహంకారం వీడాలి. సంస్కారం పరిమళించాలి. ఆశలను తిరస్కరించాలి. సహకారాన్ని స్వీకరించాలి. ఓంకారంతో నమస్కారం సమన్వయ పడాలి. ప్రియంగా మాట్లాడాలి. హితంగా పలుకరించాలి. మనచేతలు పరహితంకావాలి. మన స్వార్థం మరొకరికి అపకారం కారాదు. ఉపచారాలు ఉపకారాలు తుష్టిని పుష్టిని కల్పిస్తాయి. సాత్త్వికతం అనుసరించినవారికి ఉద్వేగాలు ఉద్రేకాలు అంతరిస్తాయి. మనసులు ప్రసన్నమవుతాయి. అప్పుడే మనలోని భక్తి భావనకు అర్థం ఉంటుంది. బ్రతుకు పరమార్థం సార్థకమవుతుంది. దేహమనే వృక్షంపై రెండు చిలుకలున్నాయి. ఒకటి ఆత్మ. రెండు పరమాత్మ. మొదటి చిలుక చిగురు, పిందె, కాయ, పండు భేదంలేకుండా అన్నింటిని కొరుకుతుంది. కొమ్మలను రెమ్మలను మారుతుంది. కడుపు నింపుకోవడానికి అనుక్షణం ఏదో ఒకటి చేస్తుంది. కారణం ఇంద్రియాలు, మనసు, బుద్ధి, ఆహారనిద్రా భయమైథునాలు జీవిసహజలక్షణాల నిజలక్షణప్రేరణలో, ఆశాపాశానికి కట్టుబడి ఎన్నో మరెన్నో వికృత వికార చేష్టలకు జీవి ఆలవాటు పడతాడు. రెండవచిలుక పరమాత్మ. ఈ జీవి చేష్టలనుతాను నిరంతరం చూస్తూనే ఉంటాడు. తన సాయం ఆత్మకోరుతుందేమోనని ఎదురు చూస్తాడు. కాని కర్మకు మాత్రమే దేహి అధికారి. కర్మఫలానికి పరమాత్మ అధికారి. కావున మనకర్మలను చూస్తున్న పరమాత్మ కర్మవిహితమైన శరీరాన్నే జీవికి మరల మరల ఇస్తుంటాడు.

జన్మమరణచక్రభ్రమణం నుండి, కర్మలు చేస్తున్నంతకాలం జీవి బయటపడదు. అలాగని కర్మలు చేయరాదనరాదు. నిష్కామ కర్మలు చేయాలి. లేదా భక్తి మార్గాన్ని అనుసరిస్తే కర్మఫలాలు శిథిలమై జన్మరాహిత్యయుక్తమైన మోక్షాన్ని అనుసరిస్తే కర్మ ఫలాలు శిథిలమై జన్మరాహిత్యయుక్తమైన మోక్షన్ని పొందడం జరుగుతుంది. అయితే ఆశనువీడడం అనుకొన్నంత సులభం కాదు. అలాని అసాధ్యమూకాదు. బ్రతుకు నిజాన్ని గుర్తించాలి. మానవమనుగడ నూరు సంవత్సరాలైతే అందు సగం అనగా ఏభై సంవత్సరాలు అంధకార బంధురమైన రాత్రిసమయం నిద్రా దివ్యవహారాలలో నిరర్థకమవుతుంది. బాల్యయౌవనాదులతో ఇరవైసంవత్సరాలుపోగా ముప్పై సంవత్సరాలు ఇంద్రియాలకు పట్టుబడి, కామక్రోధాదులకు కట్టుబడి, భార్యా బిడ్డలసంసార ఛిద్రాలకు చిక్కుబడి, అస్థిరమైన సంపదలు సంబంధాదుల సంకెళ్ళకు తగుల్కొని, వర్జింపలేక, నిర్జింపలేక, విరక్తిని పొంద లేక, విముక్తికిని పడయనేరక, పాపాలు శాపాలు తాపాలతో తల్లడిల్లుతున్నాడు. చస్తున్నాడు. పుడుతున్నాడు. బహుయోని కూపములబడి వెడలుతున్నాడు. ఇలా ఎంతకాలం? అందుకే ప్రహ్లాదుడు "చావుపుట్టువులులేని త్రోవకై" యత్నించమన్నాడు. పునర్జన్మలేని పావనమోక్షమార్గం అది భక్తివలననే సాధ్యం.

ఖట్వాంగుడినే భూపతి తన ఆయుస్సు రెండు ఘడియలు మాత్రమే మిగిలియున్నదని గ్రహించి, సర్వమును త్యజించి గోవిందనామస్మరణ చేస్తూ భయవిరహితుడై భవ్యమైన మోక్షాన్ని అందుకొన్నాడు. అలాగే శాపగ్రస్తుడై మరణమాస న్నమవుతోందని గ్రహించిన పరీక్షన్మహారాజు శ్రీశుకులు వారి ద్వారా భాగవత కథా'శ్రవణం' చేసి పరమపదాన్ని పొందాడు. నారదతుంబురులు శ్రీహరి నామసం'కీర్తన'లతో దివ్యపదమును చేరారు. ప్రహ్లాదుడు నిరంతరం శ్రీనారాయణ నామ'స్మరణ'ను ఉచ్ఛ్వాస నిశ్వాసముల వలె విడువకుండా గావిస్తు పరమభాగ వతుడైనాడు. సౌమిత్రియైన లక్ష్మణుడు అన్న శ్రీరాముని విడువకుండా 'పాదసేవ'నాచరించాడు. పృథుచక్రవర్తి స్వామిని నిరంతరం 'అర్చన'లతో అలరించాడు. అక్రూరుడు 'వందన' శతాదులతోను, హనుమంతుడు 'దాస్య'భావంతోను, అర్జునుడు 'సఖ్యత'తోను, బలి 'ఆత్మనివేదన'తోను కమలాక్షుని మెప్పించారు. రాధ, గోపికలు ఆత్మలను అర్పించారు. గోమాత పరమాత్మనే భర్తగా వలచి వలుపించి, స్వామిని భోగారంగణ్ణి చేసి తాను స్వామిలో లీనమైంది. హిరణ్యాక్షహిరణ్యకశిపులు స్వామిని ద్వేషించి అనుక్షణం స్వామినే ఆలోచించి, ఆయన చేతిలోనే మరణాన్ని పొంది తిరిగి తమ ప్రభువు వాకిట ద్వారపాలకులై నారు. ఇవన్నీ కథలు. కాదు జీవన సత్యాలు. నమ్మి ఆరాధించ వలసిన, ఆచరించవలసిన సదాచార భాగ్యాలు. భాగవతం మనకు నేర్పింది, నేర్పేది ఇదే.

**హరిమయము విశ్వమంతయు**
**హరి విశ్వమయుండు సంశయము పనిలేదా**
**హరిమయముగాని ద్రవ్యము**
**పరమాణువులేదు వంశపావన వింటే** - అని తీర్పు.

విష్ణువా, కృష్ణుడా, నారసింహుడా, రాముడా? పేర్లు వేరుకావచ్చు. పదార్థం ఒక్కటే. పరమాత్మ విశ్వమంతా నిండి యున్నాడు. చూడగల్గిన వారికి భక్తితో పట్టుపడతాడు వినగల్గిన వారితో మాట్లాడతాడు. మనసులో ఉంటాడు, మాటలో ఉంటాడు. చేతిలో ఉంటాడు. ఉండేరీతి నీతి మన వినీతిపై వివేచనాయుక్తఆధ్యాత్మకతా భావనపై ఆధారపడియుంటుంది.

కనుక మానవ ప్రపంచం కాలంకై ఎదురుచూడరాదు. కదిలేకాలానికి ఆగడం తెలియదు. సాగడమే కరిగిపోవడమే దాని ధర్మం. భక్తికి వయస్సుతో పనిలేదు. శక్తి యుక్తి సత్తా ఉన్నప్పుడే పరమాత్మశరణుకోరాలి. సంసారాలు, భార్య/భర్త బిడ్డ లున్నను, సంగతులున్నాను నాడు బృందావనవాసులు స్వామికై పరితపించారు. పరుగులు తీసారు. పరమాత్మ పరిష్వంగ భాగ్యంకై ఎదురుతెన్నులు చూచారు. వారిది ఆత్మపరమాత్మల సాంగత్యం. మనం చూచేసాధారణ శృంగారం కాదు. ఇదొక ఆధ్యాత్మిక సంబంధ బాంధవ్యవైశిష్ట్యం. అలాగే మనం పరుగులు పెట్టాల్సిన అవసరం లేదు. వయస్సు మనస్సు వచస్సులు బావున్నప్పుడే స్వామిని కీర్తిద్దాం. అర్చిద్దాం. ఆత్మనివేదన కావించుకొందాం. అందుకు ముహూర్తాలు అవసరం లేదు. అనుకోవడమేతడవుగా స్వామి స్మరణతో కాలాన్ని కరగించి భవబంధవిముక్తిని పొందుదాం. ఇదే భాగవత పరమార్థం.

**చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని**
**దయయు సత్యంబులోనుగా దలచడేని**
**కలుగనేటికి తల్లుల కడుపు చేటు.**

# దేవతల వాహనాలు - వైవిధ్యానికి ఆనవాలు

- శ్రీ అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని

*పర్యావరణ మనుగడకు కీలకం వైవిధ్యమైన జీవాలు. జీవవైవిధ్యం అంతరించిననాడు పర్యావరణంలో సమతుల్యత లోపించి ఈ భూమిమీద మానవునికేకాదు...సమస్త జంతుజాల మనుగడకే ప్రమాదం ఏర్పడవచ్చు. ఒకప్రాణి పూర్తిగా అంతరించిననాడు ఆహారచక్రం ఛిన్నాభిన్నమై ప్రకృతి వినాశనానికి దారితీస్తుంది. ప్రకృతిజీవనానికి కీలకమైన ఈ జీవవైవిధ్యాన్ని మనవారు ఏనాడో గుర్తించారు. మనకు ఆచరణలో సందేశాన్ని చూపించారు. భారతీయసంస్కృతిలో ఎంతోమంది దేవతలు. వారందరూ వివిధ రకాలైన జంతువులను వాహనాలుగా చేసు కున్నారు. కొందరికి వాహనాలుగా క్రూరజంతువులు, మరికొందరికి పశుపక్ష్యాదులు. ఇలా భిన్నంగా ఎంచుకోవడం వెనుక జీవవైవిధ్యం స్పష్టంగా కనబడుతోంది. భగవంతుని సృష్టిలో ప్రాణులన్నీ సమానమే అనే విషయాన్ని మనకు స్పష్టం చేస్తోంది.*

## ఎలుక-గణపతి

దేవతలందరిలోకి మొదటివాడైన విఘ్నేశ్వరుడు తన వాహనంగా ఎంచుకున్నది ఎలుకను. ఆయన ఆకారానికి, వాహనానికి ఏమీ సంబంధం లేదు. కానీ తన వాహనంద్వారా ఒకసందేశం అందజేస్తున్నాడు గణపతి. తన దారికి అడ్డువచ్చే వాటిని కొరికివేయడం, ఆహారాన్ని తీసుకొని కలుగులో దాచు కోవడం ఎలుక లక్షణం. భగవత్తత్వాన్ని సాధించాలి అనుకునే వారు తనదారికి అడ్డువచ్చిన వాటిని ఎలాగైనా తొలగించు కోవాలి. సాధనకు అవసరమైన సామాగ్రిని సంపాదించుకొని, ఎలుకలాగా కలుగులో కూర్చుని అంటే బాహ్యప్రపంచాన్ని విడచి ఆత్మానుభూతిని పొందాలి. ఇది మూషికవాహనుడి సందేశం.

## నంది-శివుడు

శివుడు శాంతస్వభావుడు. సర్వప్రాణులకు తండ్రి. ఆయన వాహనం నంది. నంది సహనానికి, కృషికి, స్థిరత్వానికి, విధేయతకు గుర్తు. మానవులకు కావలసిన ఆహారాన్ని పండించాలంటే ఎద్దులతో పొలాన్ని దున్నాలి. పంట వేసినప్పటి నుండి పూర్తయ్యేంతవరకు ఎద్దుపై ఆధారపడవలసిందే. ఎంత పని చేయించినా సరే... ఓపికతో తనను పోషించే రైతుకు సహకరించి ప్రజలకు ఆహారాన్ని అందిస్తుంది ఎద్దు. శివుడు భోళాశంకరుడు. తనపిల్లలు తప్పుచేస్తే తండ్రి ఎలా ప్రేమతో సర్దుకునిపోతాడో అలాగే మానవుల తప్పొప్పులను కాచేవాడు శివుడు. అందుకే నందిని వాహనంగా చేసుకుని మనిషికి ఓర్పు అవసరమని సూచిస్తున్నాడు శివుడు. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అనే సామెతను గుర్తుకు తెస్తున్నాడు.

## గరుత్మంతుడు-విష్ణువు

అల్లంత దూరంలో ఆకాశంలో ఎగురుతూనే క్రింద ఉన్న వస్తువులను గుర్తించగల నైపుణ్యం, రెక్కలు విప్పితేచాలు వేగంగా దూసుకుపోయే నేర్పుగలపక్షి గ్రద్ద. అలసటన్నది లేకుండా ఎంతదూరమైనా ప్రయాణించిరాగల శక్తి గ్రద్ద స్వంతం. స్వర్గానికి వెళ్ళి అమృతాన్నితెచ్చి తనతల్లిని దాస్యం నుండి విముక్తి చేశాడు గరుత్మంతుడు. సృష్టి, స్థితి, లయాలనే మూడింటిలో స్థితికారకుడు విష్ణుమూర్తి. అంటే ప్రజలను సంరక్షించేవాడు. సంరక్షణ బాధ్యతలను తీసుకున్నవాడు ప్రజలను నిరంతరం కంటికి రెప్పలా కాపాడుకోవాలి. లోకంలో జరుగుతున్నవాటిని గమనించగలగాలి. అందుకే తన వాహనంగా గరుత్మంతుడిని ఎంచుకొని తన బాధ్యతను నిర్వర్తిస్తున్నాడు.

## హంస-బ్రహ్మ

హంస పక్షులన్నింటిలోకి ఉన్నతమైంది. శ్రేష్ఠమైంది. అటువంటి హంస బ్రహ్మదేవునికి వాహనం. హంసను స్వచ్ఛతకు, జ్ఞానానికి చిహ్నంగా చెబుతారు. పాలను,నీటిని విడ దీయగల శక్తిఉన్న జీవి. సృష్టిని ప్రారంభించింది బ్రహ్మదేవుడు. అందుకే ఆయన స్వచ్ఛమైన జ్ఞానాన్ని కలిగి ఉంటే అది జీవులకు అందుతుంది. అలాంటి జ్ఞానంద్వారా మాత్రమే పరమాత్మను

తెలుసుకోగలుగుతాము. లోకంలో మంచి - చెడు రెండూ ఉంటాయి. ఏదిమంచో, ఏదిచెడో గుర్తించి మెసలుకుంటూ, మానవజన్మ గురించి తెలుసుకోవడమే హంసవాహనుడైన బ్రహ్మ సందేశం. ఇలా తెలుసుకున్నవారినే "పరమహంస" అంటారు.

## సింహం-పార్వతీదేవి

జంతువులలో శక్తికి, క్రూరత్వానికి ప్రతిరూపం సింహం. కేవలం జంతువులే కాదు. మనలోకూడా క్రూరమైన స్వభావం కలిగినవారున్నారు. వారిని దుష్టులంటారు. ఆదిపరా శక్తి స్వరూపమైన పార్వతీదేవి సింహాన్ని వాహనంగా చేసుకుంది. దీనిద్వారా దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షిస్తుంది. అంటే దుష్టులను, క్రూరులనుసైతం స్నేహంద్వారా సాధువుగా మార్చుకోవడం ఇందులోని అంతరార్థం.

శాంతస్వభావులైన ఋషుల ఆశ్రమాలలో క్రూరజంతువులు సాధుజంతువుల మాదిరిగా మెలిగేవని పురాణాల ద్వారా మనం తెలుసుకున్నదే.

## పద్మం-లక్ష్మి, సరస్వతీ

పద్మం. దీన్నే కమలం అంటారు. ఇది బురదలో పుడుతుంది. అయినప్పటికీ పద్మానికి బురద అంటదు. నీటిలో ఉన్నా నీటిబొట్టు అంటదు. పైగా సుగంధాన్ని వెదజల్లుతుంది. పువ్వులన్నింటిలోకి ఇదిశ్రేష్ఠమైన పువ్వు. ఐశ్వర్యానికి ప్రతీక. లక్ష్మీదేవి, జ్ఞానానికి నిదర్శనం సరస్వతీ దేవి. ఈ ఇద్దరూ పద్మంలోనే నివాసముంటారు. అందుకే "పద్మనిలయా" అని కూడా అమ్మవారికి పేరు.

సంపద ఎంత ఉన్నప్పటికీ దానికి ధర్మకర్తలా వ్యవహరించి దానధర్మాలకు వినియోగించాలని, అదేవిధంగా చదువులో మాత్రమే నిమగ్నమవకుండా జ్ఞానాన్ని, వినయాన్ని సంపాదించుకోవాలనీ, సంపదకి, గర్వానికీ దాసోహం కాకూడదని చెప్పేందుకే లక్ష్మి, సరస్వతులిద్దరూ పద్మంలో ఆసీనులై ఉంటారు.

## నెమలి-కుమారస్వామి

నెమలిది ఆకర్షణీయమైనరూపం. పురివిప్పితే కనులు తిప్పనివ్వని అందం. అయినా సరే ఎప్పుడు పడితే అప్పుడు దాని అందాన్ని ప్రదర్శించదు. వర్షంకురిసినప్పుడో... ఇంద్ర ధనస్సు విరిసినప్పుడో మాత్రమే పురివిప్పి నాట్యం చేస్తుంది మయూరం. కుమారస్వామి దేవతల సైన్యానికి అధిపతి. పోరాట పటిమ, గెలుపు వాంఛ, నాయకత్వం ఇవన్నీ సహజంగానే నాయకునికి ఉండవలసిన లక్షణాలు. నాయకుడైనవాడు తన ప్రత్యేకతలని అనవసరంగా ప్రదర్శించకూడదు. సమయం, సందర్భం చూసుకొని ప్రయోగిస్తే తనకి, లోకానికి ఉపయోగం.

అందుకే దీనికి సూచికగా నెమలిని వాహనంగా ఎంచుకొని అనవసరపు ఆర్భాటాలకి వెళ్లకుండా పరోపకారం కోసం నీ ప్రత్యేకతలను ఉపయోగించమని బోధిస్తున్నాడు కుమారస్వామి.

## ఐరావతం-ఇంద్రుడు

లోకంలో మిగతావారికంటే ఉన్నతంగా ఉన్నవారిని రాజేంద్రుడు, మునీంద్రుడు, నరేంద్రుడు లాంటి పేర్లతో ఇంద్రుడితో పోల్చటం మనం చూస్తుంటాం. మిగతావాటికంటే భిన్నంగా, ఉన్నతంగా ఉండటమే ఇంద్రత్వం. దిక్కులలో మొదటిది, ప్రధానమైనది తూర్పు. దీనికి ఇంద్రుడు అధిపతి. దిక్పాలకులను శాసించేది ఈయనే.

మరి ఇన్ని ప్రత్యేకతలున్న ఇంద్రుడి వాహనం కూడా ప్రత్యేకంగా ఉండాలికదా. అందుకే జంతువులలో ప్రత్యేకమైన గుర్తింపు కలిగిన ఐరావతాన్ని ఇంద్రుడి వాహనంగా చేశారు. అందరిలో ఒక్కడిగా కాకుండా నీకంటూ గుర్తింపు సాధించమని సూచించేదే ఐరావతం.

మిగతా ఏడుదిక్కులకు అధిపతులైన అగ్ని-మేక, యముడు-దున్నపోతు, నిర్‌రుతి-నరుడు, వరుణుడు-మొసలి, వాయువు-లేడి, కుబేరుడు-గుర్రం, ఈశానుడు-ఎద్దు వాహనాలకు అధిపతులుగా ఉన్నారు. నవగ్రహాలైన సూర్యుడు- ఏడు గుర్రాలు, చంద్రుడు-లేడి, కుజుడు-మేక, బుధుడు- సింహం, గురువు-ఏనుగు, శని-కాకి, రాహువు-పులి, కేతు-సర్పం మొదలైన జంతువులను తమ వాహనాలుగా ఎంచుకున్నారు.

ఇలా భారతీయ సంస్కృతికి పునాది వేసింది జీవ వైవిధ్యత. అందుకే దేవతలందరు భిన్నమైన జంతువులను వాహనాలుగా ఎంచుకొని జంతువులకు గౌరవస్థానాన్ని కల్పించారు. జీవవైవిధ్య సంరక్షణ అనే ప్రయోజనాన్ని మనకు చాటిచెప్పారు.



పరోపకారం పుణ్యం

# ఏరువాక పున్నమి

- శ్రీ డి.శ్రీనివాస దీక్షితులు

వ్యవసాయానికి ఎద్దులే ఆధారం. ఎద్దులు లేకుండా చిన్నపని కూడా సాగదు. అందుకే వాటిని కర్షకులు దైవాలుగా భావించి పూజించటం వేదకాలం నుంచి వచ్చిన ఆచారం. జ్యేష్ఠపూర్ణిమనాడు ఏరువాక పున్నమను జరుపుకుంటారు. ఏరువాక అంటే దుక్కిదున్నటం ఆరంభించడమే! వర్షఋతువు ప్రారంభం కాగానే భూమిని పదును చేసి విత్తనాలు చల్లటానికి సిద్ధం చేసుకుంటారు. హలకర్మకి (నాగలితో పొలం దున్నటానికి) జ్యేష్ఠ.... స్వాతి నక్షత్రాలు శుభప్రదమైనవని పరాశర మహర్షి తన గృహ్యసూత్రంలో చెప్పాడు. అంతేకాకుండా జ్యేష్ఠ పూర్ణిమనాడు ఓషధులకి... సస్యానికి అధిపతి అయిన చంద్రుడు జ్యేష్ఠ నక్షత్రానికి చేరువలో ఉంటాడు. ఈ కారణంగానే ఏరువాక పున్నమని ఈ రోజు జరుపుకుంటారు.

## ఏరువాక కూడా యజ్ఞమే!

జైమిని మహర్షి తన న్యాయమాల గ్రంథంలో ఏరువాక పున్నమని 'ఉద్వృషభ యజ్ఞం'గా పేర్కొన్నాడు. వేదకాలంలో విశేషంగా చేసే ప్రతి పనినీ యజ్ఞంగానే భావించే వాళ్ళు. ఆ క్రమంలో దుక్కిదున్నటాన్ని.... హలకర్మని.... కూడా వాళ్ళు ఒక పవిత్ర కార్యంగా... యజ్ఞంగా ఆచరించారు. అథర్వవేదం ఏరువాకని 'అనడుత్సవం'గా చెప్పింది. క్షేత్రపాల కుణ్ణి మంత్రాలతో స్తుతించి... నాగలితో భూమిని దున్ని... విత్తనాల్ని చల్లటం ఆనాడు ఆచరణలో ఉంది. తర్వాతి కాలంలో పరాశరుడు... బోధాయనుడు మొదలైన మహర్షులు తమ గృహ్యసూత్రాల్లో ఈ పండుగని ప్రస్తావించారు.

**జూన్, 08 ఏరువాక పున్నమి సందర్భంగా....**

విష్ణుపురాణం "సీతాయజ్ఞం"గా ఏరువాకని వివరించింది. 'సీత' అంటే నాగలి అని అర్థం. బుద్ధుని కాలంలో "వప్ప మంగళ దివసం"... "బీజావాపన మంగళ దివసం"..... "వాహణ పుణ్ణాహ మంగళమ్"... "కర్షణ పుణ్యాహ మంగళమ్" అనే పేర్లతో ఈ పండుగని వైభవంగా జరుపుకునే వాళ్ళు. శుద్ధోదన మహారాజు పండుగనాడు కర్షకులకి బంగారు నాగళ్ళని ఇచ్చేవాడట.

కన్నడదేశంలో ఏరువాక పున్నమని "కారుణి పబ్బం"గా జరుపుకుంటారు.

వేదకాలంలో మౌనంగా హలకర్మ చేసినా.... తర్వాతి కాలంలో అలుపూ సొలుపూ లేకుండా ఉండేందుకు "ఏరువా కొచ్చింది ఏరువాకమ్మ" అని పాటలు పాడుకుంటూ ఆనందంగా దుక్కిదున్నటం ఆనవాయితీ అయింది.

## దుక్కి చలవే చలవ.....

ఏరువాకపున్నమ నాడు కర్షకులు చాలా నమ్మకాలు తు.చ. తప్పకుండా ఖచ్చితంగా పాటిస్తారు. తరాలు మారినా వాటిని పక్కన పెట్టటానికి వాళ్ళు అంగీకరించరు. ఏరువాక నాడు వాళ్ళు ఎంతగా అవసరమొచ్చినా ఎక్కడా అప్పు చెయ్యరు. ఎవరికీ అప్పు ఇవ్వరు. చిల్లిగవ్వ కూడా ఈ రోజు ఖర్చు పెట్టటానికి ఇష్టపడరు.

అంతేకాదు... తమ ఇంట్లో ఉన్నదేదీ బయటికి వెళ్ళనివ్వరు. అలా వెడితే ఏడాదంతా దరిద్రం తాండవిస్తుందని గట్టిగా నమ్ముతారు. అందుకే... 'ఏరువాక సాగిన నాడు నిప్పు కూడా పెట్టరు' అనే సామెత ఏర్పడింది.

పంచాంగంలో కందాయ ఫలాలు అని ఉంటాయి. ఒక్కొక్క నక్షత్రానికి మూడు గళ్ళుంటాయి. ఒక్కొక్క గడి నాలుగు మాసాలకి ఫలాన్ని అందిస్తుంది. ఈ మూడు గళ్ళలో సున్నా ఉండకూడదు. అలాంటి వ్యక్తి అదృష్ట జాతకుడు అవుతాడు. ధనలాభం కలుగుతుంది. అతను పాలేరైనా... చిన్నపిల్లాడైనా సరే అతని చేత నాగలికి పసుపుకుంకుమలు పూయిస్తారు. దుక్కిని కర్షకులు ప్రాణంగా భావిస్తారు. ఆ కారణంగానే "దుక్కి చలవే చలన.... తల్లి పాలే పాలు", దుక్కి గల భూమి దిక్కుగల మనిషీ ఎన్నటికీ చెడడు" అనే సామెతలు పుట్టాయి.

## పండుగనాడు ఇలా చేస్తారు.....

ఏరువాక పున్నమ నాడు కర్షకులు పొద్దున్నే స్నానం చేసి మంచి బట్టలు కట్టుకుని శుచిగా పసువుల కొట్టాలకి వెడతారు. అక్కడ ఎద్దుల్ని శుభ్రంగా కడిగి కొమ్ములకి రంగులు

